వినత, విధేయత



అందరికీ సుఖశాంతులనూ ప్రసాదించే దీపావళి, నన్నెందుకో విస్మరించింది.

దెబ్బ తగిలిన కాలికే దెబ్బ తగులుతుందంటారు. స్నానాల గదిలో జారిపడిన వాణ్ణి, కోలుకుంటున్నానని భావించినవాణ్ణి, భోజనాల గదిలో కాలు బెణికి క్రిందపడ్డాను. గోరంత దెబ్బ కొండంతగా బాధించడంతో ఆసుపత్రిలో పదిరోజులుండి, ఇంటికి వచ్చిన నేను ప్రముఖాంధ్రకు వ్రాయలేకపోతానేమోనని భావించాను. దీపావళి వెల్తురు కాన్తుల కన్నా, ప్రముఖాంధ్ర సంచికకు విఘాతం కలుగకూడదని, ఇలవేలుపు వేంకటేశ్వరుణ్ణి ప్రార్థిస్తూ వచ్చాను. మంచం మీద పడుకునే ప్రముఖాంధ్ర వ్యాసాలు కూర్చి నవంబర్ సంచికను పూర్తిచేస్తూ, డిసెంబర్ సంచికకు కూడా వ్యాసాలు వ్రాస్తున్నాను. 2016 డిసెంబర్ సంచికతో 22 సంవత్సరాలు అవిచ్ఛిన్నంగా వెలువడుతూందనే భావన కొత్త శక్తిని కూరుస్తున్నది. ఇది నా అభిమానులు నాకు ప్రసాదించిన ఆశీస్సులు. చివరి శ్వాసవరకూ ప్రముఖాంధ్ర వెలువడుతుందనే విశ్వాసం కలిగింది. నా శ్వాస నన్ను విడువదు, నా విశ్వాసం సడలదు.

- గోటేటి శ్రీరామారావు

(6వ పేజీ తరువాయి) దీనిలోని అశ్వాసాంత పద్యాలు పూర్వ కవులవలె, ఆత్మాశ్రయాలు కాక, కొత్త పుంతలు తొక్కి భక్తి, జ్ఞాన, నీతి, వైరాగ్య బోధకాలై మానవులకు ధర్మ మార్గదర్శకాలై విలసిల్లాయి. 64 వేల పద్యాలలో వ్యాస భారతాన్ని శ్రీపాదవారు ఒకే చేతిమీదుగా 16 సంవత్సరాలలో తెనిగిస్తే, కవిత్రయం (నన్నయ, తిక్కన, ఎర్రాప్రగడ) మూడు వందల ఏళ్ళలో 21 వేల పద్యాలలో తెనిగించారు. శ్రీనాథుని కవిత్వం శ్రీపాద వారికి శిరోధార్యం. 'గౌతమి మహత్యం', 'సత్యనారాయణోపాఖ్యానం', 'గజానన చరిత్రం' అన్నీ మృదు పద ప్రయోగానికి, నిర్దుష్టమైన భాషకు ధారాశుద్ధికి తార్కాణాలు. 'యాజ్ఞవల్క్య చరిత్రము' శాస్త్రి గారి తత్వ విద్యా పరిజ్ఞానానికి తార్కాణంగా నిలుస్తుంది. 'సంస్కృత కవి జీవితాలు', 'తెనాలి రామకృష్ణ కవి చరిత్రము', 'కాళిదాసు విలాసము' ఇత్యాదులు శాస్త్రిగారి రచనలు. 'బ్రహ్మానందం' వీరి అచ్చతెనుగు కావ్యం. 'ఆంధ్రాభ్యుదయం' రాసి, దీనిని సమకాలిక, పూర్వాంధ్ర పండితుల, కవుల, సాంఘికవేత్తల పట్ల తన అభిప్రాయ వేదికగా తీర్చిదిద్దారు.

ప్రాచీన కవుల మీద, వారి సాహిత్యం మీద సంప్రదాయం మీద శాస్త్రిగారికి ఎంతో గౌరవముంది. శ్రీనాథుడు సీస పద్యాలను పాడు చేసాడని విశ్వనాథ సత్యనారాయణ, నన్నయకు అలంకార శాస్త్రం రాదని జమ్మలమడక మాధవ రామశర్మ తమ ప్రసంగాలలో విమర్శిస్తే శాస్త్రిగారు పత్రికా ప్రభావం వల్ల కలిగే ప్రయోజనాలను గురించి చర్చించడానికి, జరిగిన ఒక సభలో గిడుగు రామమూర్తి తిరుపతి వెంకటకవులతో పాటు శ్రీ పాదవారు కూడా పాల్గొన్నారు. ఆ సభలో తను తప్పులు రాసినట్లు విమర్శలు వస్తే, వెంటనే సమాధానం చెప్పి సమర్థించుకున్నారే తప్ప తాను నమ్మిన గ్రాంథిక భాషను విడిచిపెట్టడానికి సమ్మతించలేదు. అందరు చదివే దినపత్రికలు వ్యావహారిక భాషలోనే ఉండాలనీ, నాటకాల్లో, నవలలో పాత్రోచిత భాష ఉండాలనీ ఆయన కోరుకున్నారు.

తాను రాసిన 'బొబ్బిలి యుద్ధం' నాటకం వీర రస ప్రధానమై పలుసార్లు ప్రదర్శింపబడి ప్రేక్షకుల ప్రశంసలందుకొన్నా తాను మొదట రచించిన 'కలభాషిణి' యే ఉత్తమ నాటకమని శాస్త్రిగారి అభిప్రాయం. స్వాతంత్ర్యోద్యమ స్ఫూర్తితో ఆయన 'స్వరాజ్యోదయము' అనే నాటకం రాశారు. దానిపై నాటి బ్రిటీష్ ప్రభుత్వం ఆయనపై చర్య తీసుకోవచ్చన్న భయంతో ఇంట్లోవారు ఆ గ్రంథాన్ని తగులబెట్టారు. తర్వాత శ్రీపాదవారు 'తిలక్ మహరాజ్', 'గాంధి విజయధ్వజము' అనే రెండు నాటకాలు రాశారు. తిలక్ మహరాజ్ నాటకంలో ప్రభుత్వాన్ని దూషించలేదని తొలుత 'జార్జి ఫిఫ్త్' అనే నాటకం రాశానని శాస్త్రిగారు రుజువు చేయడంతో తిలక్ మహరాజ్ నవలపై హైకోర్టు కేసు వీగిపోయింది. తన అభిప్రాయాలను ప్రజలకు తెలియజేసేందుకు గాను శాస్త్రిగారు 'గౌతమి' అనే పత్రిక స్థాపించారు. 'గౌతమి' వారి స్థానిక భావుకతను, 'కళావతి' వారి కళాభిరుచిని, 'వందేమాతరం' వారి దేశభక్తి ప్రదీప్తిని 'మానవసేవ' వారికి గల సాంఘిక నిరతిని, 'వజ్రాయుధం' భాషా రంగంలోని వివాదాలలోని కాఠిన్యాన్ని నిరూపిస్తున్నాయి. శ్రీపాద వారి పోరు వ్యావహారిక బాషావారి గిడుగ రామమూర్తితో ఒకవైపు, మరోవైపు ప్రచ్ఛన్న భాషావాదులతో కొనసాగింది.

తూర్పు గోదావరి జిల్లాకి చెందిన పెండ్యాల వెంకట సుబ్రహ్మణ్యశాస్త్రి 'మహాభారత చరిత్రము' అనే ఒక పుస్తకం వెలువరిస్తే శ్రీపాదవారు దాన్ని ఖండించారు. ఈ వివాదంపై రాజమండ్రి కోర్టులో వ్యాజ్యం కూడా ఏడాదిన్నర పాటు నడిచింది. ఈ కేసులో పెండ్యాల వారికి ఆయన పన్నెండు రూపాయలు నష్ట పరిహారం కూడా చెల్లించారు. కృష్ణాజిల్లాలోని జగ్గయ్యపేటలో మొదట అవధానం చేసి సన్మానం పొందారు. తర్వాత ఎన్నో అష్టావధాన, శతావధానాలు చేసి బహుమతులు, సన్మానాలు పొందారు. 1937లో బ్రిటీష్ ప్రభుత్వం శ్రీపాద వారి ప్రతిభను గుర్తించి మహామహోపాధ్యాయ అనే బిరుదుతో సన్మానించింది. పాలకొల్లులో స్వర్ణాభిషేకం జరిగినప్పుడు శ్రీ పాదవారికి కవిసార్వభౌమ బిరుదు లభించింది. రాజమండ్రిలో ఆయనకు కవి గండపెండేరం లభించింది. మయూర్ భంజ్ (ఒడిశా) సంస్థానంలో సంస్కృత శతావధానం చేసి, సన్మానింపబడి శ్వేత గజారోహణం, కవిరాజు బిరుదు పొందారు. ఆంధ్ర రాష్ట్ర ప్రభుత్వం ప్రథమ ఆస్థానకవిగా ఆయన్ని జీవితాంతం కొనసాగించింది. ఆంధ్ర విశ్వకళాపరిషత్ కళా ప్రపూర్ణ అనే బిరుదు ప్రప్రథమంగా శ్రీపాదవారికి అందజేసింది. 95 ఏళ్ళ వయసులో 1960 డిసెంబర్ 28న ఆయన కాలధర్మం చెందారు. ●



గాన కళా ప్రవీణ డా॥నూకల చినసత్యనారాయణ

చందురు వర్ణుని యంద చందమును
హృదయారవిందమున జూచి
బ్రహ్మానందమనుభవించు
వారెందరో మహానుభావులు
అందరికీ వందనములు...

ఉపన్యాస వేదికలో వారు గానం చేస్తూ ఉపన్యసిస్తున్నారు. ఆయన వ్యాఖ్యానం త్యాగయ్య ఆత్మను ఆవిష్కరించి ఎందరెందరో తన్మయులై వింటున్నారు.

"సామగానలోల మనసిజ లావణ్య
ధన్యమూర్ధన్యులెందరో..."
మానస వన చరవర సంచారము సలిపి
మూర్తి బాగుగ బొడగనెడు వారెందరో...
సరగున పాదములకు స్వాంతమను
సరోజమును సమర్పణము జేయువారెందరో... ప్రతి చరణంలో మాటమాటకీ ఉన్న విశేషార్థాల్ని వివరిస్తూ ఆయన అక్కడున్న వారందరికీ త్యాగరాజును దర్శింపజేశారు. అటు సంగీతంలో, ఇటు సాహిత్యంలో... రెంటిల్లో అంచులు అనుభవించినవారు, వందలాది శిష్యులకు, వేలాది సభికులకు ఆత్మానుభవపాఠాలు చెప్పినవారు.

డా. నూకల చినసత్యనారాయణ పాడుతోంటే సంప్రదాయ పుష్టి, నూతన మార్గ సృష్టి, సమ్మోహనత్వంపై దృష్టి... ఈ మూడు... మన అనుభవంలోకి వస్తాయి. మల్లెపూలు కనిపిస్తే దోసిట్లోకి తీసుకొని కళ్లు మూసుకొని వాసన చూస్తూ మైమరచిపోతాం. డా. నూకల చినసత్యనారాయణ బాల్యంలోకి తొంగిచూస్తే ఎన్నో విషయాలు తెలుస్తాయి. ఆయన తూర్పు గోదావరి జిల్లా ఆదుర్రు గ్రామంలో జన్మించారు. తల్లిదండ్రులు పుణ్యమూర్తులైన యజ్ఞచయనమ్మ, అన్నాజీరావులు. ఆయనకు సంగీతం వారసత్వంగానే వచ్చింది. నూకలకు ఆధ్యాత్మ బీజాక్షరాలు నేర్పింది యజ్ఞచయనమ్మ. ఆమె వీనులవిందుగా గానం చేస్తుంటే బంధువుల్లో చాలామంది విని ఆనందించేవారు. తల్లి కొంగు పట్టుకొని దోబూచులాడుకొనే వయసులోనే నూకల ఆధ్యాత్మరామాయణ కీర్తనల ప్రభావానికి లోనయ్యారు. అన్నాజీరావు శ్రీవిద్యోపాసకులు. ఆ వాతావరణం నూకలని సంప్రదాయం పట్ల ఆకర్షితులయ్యేలా చేసింది. ఇంత పెద్ద మహా మహోపాధ్యాయులకు చిన్నతనంలో గాత్రం కన్నా వయొలిన్ మక్కువ కలగడం విశేషం! కంభంపాటి అక్కాజీరావు సలహాతో అన్నాజీరావు నూకలని మంగళంపల్లి పట్టాభిరామయ్య వద్దకు పంపారు. ఆయన కుమారులే డా. మంగళంపల్లి బాలమురళీకృష్ణ. నూకల మంగళంపల్లితో జట్టుకట్టి ఒద్దికగా మూడేళ్ళు సంగీతం అభ్యసించి ఆ తర్వాత ఎందుకనో తన మనసు మార్చుకోన్నారు. ప్రపంచవ్యాప్తంగా ఎంతోమందిని ప్రభావితం చేసిన ద్వారం వెంకట స్వామినాయుడి వయోలిన్ గమకాలు నూకలను నిద్రపోనిచ్చేవికావు. విజయనగరం వెళ్లి నాయుడి శిష్యరికం ప్రారంభించారు. ఆయన నాయుడి అనేక ప్రదర్శనల్లో పక్కవాద్యం వాయించగలిగారు! కీర్తి సిరిని మూటగట్టుకోగలిగారు! ద్వారం వెంకటస్వామి నాయుడు, నూకలను స్వయంగా సంగీత సద్గురు శ్రీపాదపినాకపాణి వద్దకు పంపారు. గాత్ర సంగీతంలో ప్రవేశించారు. ఇక అప్పట్నుంచీ గాత్రమే ఆయన చిరునామాగా మారింది.

అప్పట్లో విశాఖపట్నంలో జరిగిన సంగీత పోటీల్లో నూకల స్వర్ణపతకం పొందారు!

ఆయన తెలుగు, ఆంగ్ల సాహిత్యాలు రెంటిల్లో ఎం.ఏ. చేశారు. అందువల్లే కీర్తనలను అర్థవంతంగా, స్పష్టంగా, నిర్దుష్టంగా పాడగలరు. వాటి సాహిత్యార్థాలను, సంగీత విశేషాలను తెలుగు, ఇంగ్లీషుల్లో చక్కగా సామాన్యులకు సైతం అర్థమయ్యేలా వివరించగలరు. తెలుగు సాహిత్యంలో ప్రప్రథమంగా జ్ఞానపీఠ అవార్డు పొందిన విశ్వనాథ సత్యనారాయణకు నాలుగేళ్లపాటు చాలా సన్నిహితంగా ఉన్నారు. విజయనగరం మహారాజా సంగీత కళాశాలలో, పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయంలోనూ ఆచార్యులుగా ఉన్నారు. సంగీతంలో కలకాలం నిలిచిపోయే "ది మోనోగ్రాఫ్ ఆఫ్ త్యాగరాజాస్ పంచరత్న క్రితీస్" అనే గ్రంథం రాశారు. ఇందులో ఘన రాగపంచరత్నాలకు ఇంగ్లీషులో విశ్లేషణ, వ్యాఖ్యానం, వివరణ కనిపిస్తాయి. "రాగలక్షణ సంగ్రహం" అనే గ్రంథం రాశారు. ఇందులో 250 రాగాల లక్షణాలను సోదాహరణంగా వివరించారు. "సంగీతసుధ" అనే పాఠ్య గ్రంథం రాశారు. ఇది విద్యార్థులకుద్దేశించినది. ముత్తుస్వామి దీక్షితుల కీర్తనలకు, నవగ్రహ కీర్తనలకు స్వరాలు సాహిత్యార్థాలతో కూడిన వ్యాఖ్యానం రాశారు. "లిజన్ అండ్ లెర్న్" అన్న పేరుతో నలభైకి పైగా ఆడియో క్యాసెట్లు రూపొందించారు. ఆయన గురువు శ్రీపాదపినాకపాణి స్వరపరచిన నూటికి పైగా అన్నమయ్య కృతుల నుంచి కొన్నిటిని ఏర్చికూర్చి ఆడియో క్యాసెట్లుగా తెచ్చారు. కర్ణాటక సంగీతం నేర్చుకోవాలనుకునేవారు. ఏ గురువునూ ఆశ్రయించకుండానే ఆడియో క్యాసెట్లుగా తెచ్చారు. ఇపుడు కర్ణాటక సంగీతం నేర్చుకోవాలనుకునేవారు ఏ గురువునూ ఆశ్రయించకుండానే ఆడియో క్యాసెట్లు విని నేర్చుకునే వీలుండడం గమనార్హం. తిరుమల తిరుపతి దేవస్థానం ఆస్థాన విద్వాంసుడిగా, కంచి కామకోటి పీఠం, శృంగేరి, పుష్పగిరి, మైసూరు గణపతి సచ్చిదానంద... వగైరా పీఠాల ఆస్థాన విద్వాంసుడిగా... సంగీత వ్యాప్తికి ఆయన ఎంతో కృషి చేశారు. "కేవలం స్వరస్థానం మీదనే నిలిపి పాడే సంప్రదాయం కన్నా శ్రుతుల భిన్నత్వంలో ఒకే స్వరం ఎన్నో అవతారాలు ఎత్తగల్గుతున్నప్పుడు ఆ వైశిష్ట్యాన్ని నిలుపుకుంటూ పాడగల్గడం" ఆయన బాణీ. ఆయన హృదయంలోనే సంగీత శారద కొలువైంది. ఎన్నో బిరుదులు ఆయన్ని వరించాయి. "అన్నమాచార్య విద్వన్మణి, సప్తగిరి సంగీత విద్వన్మణి, నాదనిధి, రాగహృదయజ్ఞ, నాదసుధార్ణవ, సంగీత సార్వభౌమ, సంగీతక్షీరసాగర, గానకళా గంధర్వ, లక్షలక్షణ మార్తాండ, సంగీత సుధాకర..." వంటివి! చాగంటి కపాలేశ్వరరావు నూకల గ్రహభేదం గురించి ఆయన పేరులోనే 'చిన' సత్యనారాయణ శాస్త్రంలో, గానంలో, వ్యాఖ్యానంలో మిన్న!

కృతజ్ఞతలు– చీకోలు సుందరయ్య

SRI RAJARAJESWARI JEWELLERY
The Oldest Jewellery Shop in Pondy Bazaar
81, Pondy Bazar, T. Nagar, Chennai - 600 017.
Phones : 28152387, 28154653
The Purest Treasurer Mortal Times Afford is Spotless Reputation

Lovely Stay at Holy Tirupathi *The Gateway of Lord Balaji*
HOTEL MAYURA
204, 209, T.P. Area, Tirupati - 517 501 (A.P.)
(Opposite Bus Station)
Phone : 0877-2225925, 2225251, Fax : 0877-2225911
e-mail : mayurahotels@yahoo.co.in, Grams :

జయ అన్న పేరులోనే పట్టిన కార్యం జయమవుతుందనే అనే అర్థం ఉన్నది. చిన్నప్పట్నుంచీ ఆమెకు ఆత్మవిశ్వాసం అధికం!

ఆమె తల్లి సంధ్య గారాబు కుమార్తె. తల్లి అసలు పేరు- వేద. వాళ్ళు అడయార్ గాంధీనగర్ మొదటి మెయిన్‌రోడ్డులో ఉన్నప్పుడూ, నేనూ, అప్పటి త్యాగరాజనగర్ సబ్‌రిజిస్టారు రామచంద్రరావుగారితో కలిసి ఆమె పెత్తల్లి విద్య మంచి వాంపుస్టార్. చిత్తూరు వి.నాగయ్యగారు ఆమెను 'నా యిల్లు' తమిళంలోని ఎన్‌వీడు చిత్రంలో పరిచయం చేసిన తార విద్య. ఆమె భరణీ బానుమతి చిత్రంలో కూడా నటించారు; ప్రసిద్ధిగన్నారు.

నిజానికి విద్యకన్న వేద (సంధ్య) మంచి అందాల రాశి. నవ్వితే నవరత్నాలు రాలే నవవయసులో ఆమె 20 సంవత్సరాల అప్సరసలా ఉండేవారు. ఆ అప్సరస మేనక కన్న కన్య శకుంతలలా కీర్తి నొందకుండా ఎలా ఉంటుంది.

జయలలిత ఆయురారోగ్య అధికార స్వభావాలు ఆమె ఆయుష్షు ఉన్నంతవరకూ ఉంటాయ్! ఆమె చివరిశ్వాస వరకూ అధికారంలోనే ఉంటారనే నా విశ్వాసం. అట్టడుగు వర్గాలనుంచీ అధికార వర్గం వరకూ ఆమెను 'అమ్మ అమ్మ' అనే గౌరవభావం ఉన్నది. రెండు సంవత్సరాల క్రితం ముఖ్యమంత్రిణి అయినప్పట్నుంచీ జనోపకార్యాల నెన్నిటినో చేసారు. చేస్తూనే ఉన్నారు. ప్రజల్లో ఇంతగా 'అమ్మ'గా ప్రస్తుతి నొందిన మరో నాయకురాలు లేరు. అందుకే ఆమ్మను చిరంజీవి అంటున్నాను. ఆసుపత్రి నుంచీ కోలుకుని ఇంటికి వస్తుంది.

సకలశక్తిమంతురాలు జయలలిత!

జయలలితకు అయిదారుభాషలు ఇంగ్లీషు, హిందీ, తమిళ, తెలుగు, కన్నడ, మలయాళ భాషలను సరళంగా మాట్లాడగలరు. మాటల్లో సూటిదనం, శూరత్వం, మృదుత్వం, స్పష్టత ఉంటాయి. సర్వ విషయ పరిజ్ఞానం ఉన్న వ్యక్తని ఆమె మాటల్లో మనకు తెలిసిపోతుంది. మొహంలో భావోద్వేగాలూ ఉండవు. కానీ ఆమె మాటతీరు, మట్లాడే మాటలు, జీవనశైలి, తీసుకున్న నిర్ణయాల ఆధారంగా ఆమె ధృఢ మనస్సు

జయలలిత నిదానంగా, సున్నితంగా ఎదుటివారి కళ్లలోకి సూటిగా చూస్తూ చెప్పదలచుకున్న విషయాన్ని స్పష్టంగా మాట్లాడుతుంది. ఎదుటివారి మాటలు ఇబ్బంది కలిగిస్తున్నా సూటిగా ఆ విషయాన్ని వారికే చెప్తారు. ఆమె స్వరంలో కోపం ధ్వనించినా మొహంలో మాత్రం కనిపించదు. చిన్నప్పట్నుంచీ మనోధైర్యం ఆమెకు అలవడిన సహజగుణం.

రియాక్టివ్ ఫీలింగ్స్...

బాల్యంలోనే తండ్రిని కోల్పోవడం, తల్లి పెంపకంలో గారభంగా పెరిగింది. అప్పటికీ ఆమె పెత్తల్లి విద్య సినిమా రంగంలో ప్రవేశించారు. అయిష్టంగానే సినిమారంగంలోకి ప్రవేశించడం జరిగింది. స్వతంత్రభావాలు కల శక్తిమంతురాలు, ఇవన్నీ జయలలిత వ్యక్తిత్వాన్ని ప్రభావితం చేశాయని చెప్పవచ్చు. పైకి కఠినంగా కనిపించినా ఆమె ప్రేమకోసం అన్వేషిస్తూనే ఉన్నారు. తన జీవితంలో 1/3 శాతం తల్లి, 1/3 శాతం ఎమ్జీఆర్, 1/3 శాతం శశికళ ఆక్రమించారని అంగీకరిస్తారామె. తన బాల్యం గురించి మాట్లాడేటప్పుడు గొంతు మంద్రస్థాయిలో సున్నితంగా ఉంటుంది. ఆమె వాటిని నిజంగా ఫీలవుతున్నారని, వాస్తవాలనే చెపుతున్నారని అనిపిస్తుంది. ఆమెది అనుభూతి వ్యక్తిత్వం. తమిళనాడు అసెంబ్లీలో తనకు జరిగిన పరాభావాన్ని మనసులోకి తీసుకున్నారు, ప్రతీకారం తీర్చుకున్నారు. రాజకీయాల్లో ప్రధాన వ్యక్తి అయ్యారు.

బాల్యంలో కామ్‌గా, సిగ్గరిగా ఉండేవారు. ఎంత సీరియస్ విషయం మాట్లాడుతున్నా ఆ భావాన్ని తన మొహంలో కనపడనీయరు. ఎవరేం చెప్పారనేదానికన్నా తనకేది మంచని అనిపిస్తోందో అదే చేస్తారు. వాస్తవిక దృక్పథాన్ని వెల్లడిస్తుంది. సినిమాలు,రాజకీయాలూ రెండూ విభిన్నవే అయినా తన జీవితం వాటిలోనే సాగిందని, సాగుతోందని చెప్తారు. తనకు ఇష్టం ఉన్నా లేకున్నా... ఒకసారి ఒక పని చేపట్టాక దానికి పూర్తిగా అంకితం కావడమే జయలలిత బలం. అందుకే ఆమె సినీరంగంలోనూ, రాజకీయరంగంలోనూ కూడా నెంబర్‌వన్ అయ్యారు. ●

శ్రీ భగవద్గీతా మకరందం!

శ్రీ విద్యాప్రకాశానందగిరి స్వాములవారు

102

పదునెనిమిదవ అధ్యాయము - మోక్ష సన్న్యాస విభాగయోగము

33. ధృత్యా యయా ధారయతే మనః ప్రాణేన్ద్రియక్రియాః
యోగేనావ్యభిచారిణ్యా ధృతిస్సా పార్థ ! సాత్త్వికీ

వ్యాఖ్య : ప్రపంచములో ధైర్యము గలవారనేకులుందురు. కొందఱు యుద్ధమున ధైర్యముతో పోరాడుదురు. కొందఱు ధైర్యముతో నిశీధ సమయమున భీకరారణ్యములలో సంచరించుచుందురు. కొందఱు ధైర్యముతో మహోన్నత పర్వత శిఖరముల నధిరోహించుచుందురు. సముద్రములను లంఘించుచుందురు. కాని ఆ ధైర్యములన్నిటకంటెను ఉపరిస్థానమునన్నున్న ధైర్యమొకటి యిచ్చోట చెప్పబడి నది. అదియే సాత్త్విక ధైర్యము. అనగా ఏ ధైర్యముచే మనుజుడు తన మనస్సును, ఇంద్రియములను విషయ భోగముల నుండి నిరోధించునో, దృశ్యవ్యామోహము నుండి నివృత్తుడగునో, అదియే గొప్ప ధైర్యమని భగవానుడిచట సెలవిచ్చెను. కాబట్టి తక్కిన ధైర్యములు కలిగి యున్నను, జన్మ సాఫల్యకారణమగు, ఈ పారమార్థిక ధైర్యమును గూడ మనుజుడు తప్పక గలిగియుండవలెను.

అయితే ఆ ధైర్యము చపలముగనుండరాదు. ఈ రోజున ఉండి రేపు అదృశ్యము కారాదు. కనుకనే 'అవ్యభిచారిణ్యా' (నిశ్చలమైన) అని చెప్పబడినది. ఏలయనగా కొందఱు ముముక్షువులు ఏదియో యొక ఆవేశములో ధైర్యము కలిగి తమ ఇంద్రియాదులను నిగ్రహించినవారై, మఱల పరిస్థితుల ప్రాబల్యముచే క్రమముగా ఆ ధైర్యమును సడలించి, విషయములందు ప్రవర్తించుట కానంబడు చున్నది. అది 'అవ్యభిచారిణి ధైర్యము' కాదు. కాబట్టి స్థిరముగా నుండునట్టి ధైర్యమునే అవలంభించవలెను.

34. యయా తు ధర్మకామార్థా న్ధృత్యా ధారయతే 2ర్జున!
ప్రసజ్గేన ఫలాకాంక్షీ ధీతిస్సాపార్థ! రాజసీ

వ్యాఖ్య : పురుషార్థములు నాలుగు – (1) ధర్మము (2) అర్థము (3) కామము (4) మోక్షము. ఈ చతుర్విధ పురుషార్థములలో మొదటి మూడు మాత్రమే యిచట తెలుపబడినవి. నాల్గవది యగు మోక్షము చెప్పబడలేదు. దీనిని బట్టి రాజస ధైర్యయుతులు మోక్షమును గూర్చి అంతగా పట్టించుకొనరని విదితమగుచున్నది. కాబట్టి ఈ ధైర్యము పరమార్థ దృష్టిలో అంత ఉత్తమమైనదిగా తేలుచున్నది. ఇంద్రియములను నిరోధించుట ద్వారా మోక్షము కొఱకు యత్నింపజేయునట్టి సాత్త్వికధైర్యమే ఉత్కృష్టమైనది.

ధర్మార్థకామములను మూడు పురుషార్థముల నన్వేషించువారికంటె, నాల్గవ పురుషార్థమగు మోక్షము నన్వేషించువాడే శ్రేష్ఠుడు. అయితే చతుర్విధ పురుషార్థము లందరి మొదటిదియగు ధర్మమున కర్థము సామాన్య ధర్మమనియే గ్రహించవలెను. విశేషధర్మము పరమాత్మావలంభనమే. దైవనిష్ఠయే, ఆత్మజ్ఞానమే యగును.

'సజ్గేన' అని చెప్పక 'ప్రసజ్గేన' యని చెప్పుటచే అట్టివారా పురుషార్థములందు మిక్కుటమగు నాసక్తిని జూపుదురని తెలియుచున్నది.

35. యయా స్వప్నం భయం శోకం విషాదం మదమేవ చ
న విముఞ్చతి దుర్మేధా ధృతిస్సా పార్థ! తామసీ

వ్యాఖ్య : ధైర్యము గొప్ప సుగుణమే. కాని అది దుర్విషయములందు వినియోగింప బడునపుడు నిష్ఫలమైపోవును. తమో గుణయుతడు ఒకానొక ధైర్యమవలంభించి తన అతి నిద్రను, భయమును, దుఃఖమును, దిగులును, మదమును వదలకయే యుండును. ధైర్యమను గొప్ప సుగుణము అట్టి నిద్రాభయాది నికృష్ణవస్తు సంపాదనమున వినియోగింపబడుటచే నిరర్థకమైపోయినది. కాబట్టి ఆ ధైర్యమునే సద్వస్తు సంపాదనమునకు, సచ్ఛీలసముపార్జనకు, మోక్షప్రాప్తికి, దైవకరుణను సంపాదించుటకు వినియోగించుట ఉత్తముని ధర్మమైయున్నది. వాల్మీకికి అపారధైర్యము, పట్టుదల కలదు. కాని మొట్టమొదట ఆ ధైర్యమును, పట్టుదలను, దుర్వృత్తులందు, పరమహింసా కార్యములందు ఉపయోగించి విఫలుడయ్యెను. కానీ మహనీయుల సాంగత్య ప్రభావముచే తిరిగి ఆ ధైర్యమునే రామనామ జపమందును, దైవధ్యానమందును వాడుకొని ధన్యుడయ్యెను.

'దుర్మేధా'– అని చెప్పుట వలన అతనికి మేధ (తెలివి) యున్నప్పటికిని దానిని వక్రమార్గమున ప్రవేశపెట్టెనని భావము.

'స్వప్నమ్' – (నిద్ర) ఇచట నిద్రయని చెప్పిన చోట 'అతినిద్ర' యని భావించుకొనవలెను. ఏలయనిన మితనిద్ర సర్వులకును అవసరమే అయియున్నది.

36. సుఖం త్విదానీం త్రివిధం శృణు మే భరతర్షభ!
అభ్యాసాద్రమతే యత్ర దుఃఖాన్తం చ నిగచ్ఛతి

వ్యాఖ్య : అభ్యాసాత్' – సాత్త్వికసుఖము, దైవసుఖము, బ్రహ్మానందము అభ్యాసములవలననే జీవునకు లభించగలదని భగవాను డిచట తెలియచేయు చున్నాడు. అధ్యాత్మ విద్య మాటలచే, 'వాచా' జ్ఞానముచే కలుగునది కాదు. అది అనుభవవిద్య (Practical Science) అందలి సిద్ధాంతమును అనుభవములో చూచుకొనవలెను. అపుడే జీవునకు ప్రత్యక్ష సుఖము లభించును. చాలమంది 'మాకు సాక్షాత్కారమెట్లు కలుగును, దుఃఖమెట్లు తొలగును, సుఖమెట్లు కలుగును? అని ప్రశ్నించుచుందురు. భగవానుడందులకు 'అభ్యాసము చేయుడు మీ కవి లభించును' అని యిచట చెప్పుచున్నాడు. ప్రయత్నము చేయ, సాధింపక, ఒడ్డున కూర్చొని మాటలు చెప్పుట ద్వారా పరమార్థనుభవమెన్నటికిని కలుగనేరదు. పెరుగును చిలికిననే వెన్న వచ్చును. నువ్వులను పిండిననే నూనె వచ్చును. చెఱకును నమలిననే మాధుర్యమనుభూతమగును. అట్లే అభ్యాసము చేతనే 'దుఃఖాంతము' సుఖావిర్భావము జీవునకు కలుగగలదు.

'దుఃఖాన్తం చ నిగచ్ఛతి' – ఈ ప్రపంచమున ప్రతిజీవియు కోరునది దుఃఖరాహిత్యము, దుఃఖాంతము. జీవితమందలి అతి ముఖ్యమైన క్లిష్టతరమైన సమస్య. ఈ దుఃఖాంత సంపాదనమే యగును. ప్రతివానిని ఈ సమస్యయే బాధించుచున్నది. చీమయు ఈ దుఃఖాతమునకే, అనగా దుఃఖమును పోగొట్టుకొనుటకొఱకే యత్నించుచున్నది. దోమయు దాని కొఱకే యత్నించుచున్నది. చతుర్ముఖ బ్రహ్మ దాని కొఱకే యత్నించుచున్నాడు. దుఃఖము యొక్క అంతమును (దుఃఖరాహిత్యమును) ప్రాణి యెచట పొందగలదు? ఈ మహాసంసారిక బాధలన్నియు ఎచ్చోట నుపశమించగలవు? దుఃఖములేని చోటు ఏది? ప్రపంచములో ఎచట వెతికనను అట్టిచోటు లభించగలదా? శాశ్వత సుఖము నొసంగగల వస్తువు ఈ దృశ్యసమూహమందు కలదా? లేదు. దుఃఖము యొక్క అంతమును జీవుడు పొందగల్గుచున్నాడని ఈ శ్లోకమున చెప్పబడినది. ఈ భగవద్వాక్యము వలన ప్రతి ప్రాణిని వేధించుచున్న 'దుఃఖనివారణ సమస్య' తీరిపోయినది. దుఃఖనివారణ కుపాయము సాత్త్వికసుఖ సంపాదనమే, ఆత్మానంద ప్రాప్తియే. కాబట్టి ఆత్మసుఖమునే, దైవసుఖమునే అన్వేషింపవలయును. అది యెట్లు లభ్యమగును? అభ్యాసమువలన, సాధన చతుష్టయరూప సంపత్తి చేత, అమానిత్వాదిగుణములచేత, 'నిగచ్ఛతి' అని చెప్పుట వలన అభ్యాసముచే నట్టి దుఃఖరాహిత్యస్థితిని జీవుడు లెస్సగబడయగలదని తెలియుచున్నది.

(తరువాయి వచ్చే సంచికలో)

గురువులు సత్య(శో)బోధకులు

గు- చీకటి

రు - వెలుగు

గురువు- చీకటి నుంచి వెలుగుల వైపు నడిపించేవాడు.

సమాజం అజ్ఞానమనే చీకట్లో కొట్టుమిట్టాడుతున్న సమయంలో... వ్యాసమహర్షి చతుర్వేద సంకలనానికి పూనుకున్నాడు. కొంత చీకటి తొలగిపోయింది. వేదాల్ని అర్థంచేసుకోగల విద్వత్తు ఎంత మందికి ఉంటుంది? ధర్మసారాన్ని సుబోధకం చేయాలనే లక్ష్యంతో అష్టాదశ పురాణాల్ని వ్యాసులవారే రచించారు. మరికొంత చీకటి తొలగిపోయింది. బతుకు పరుగులో అలసిసొలసే అతి సామాన్యుడు అంత విస్తారమైన సాహిత్యాన్ని చదవగలడా? వేదవేదాంగాల్ని ఉపనిషత్తుల సారాన్నీ కురుపాండవుల జీవితాలుగా మలచి.. పద్దెనిమిది పర్వాలతో మహాభారతాన్ని రచించాడు. ఇంకొంత చీకటి తొలగిపోయింది. ఆ చీకట్లను పారదోలాల్సిన బాధ్యత తన తర్వాత వచ్చే గురుపరంపరకు అప్పగించాడు. కాబట్టే, ప్రతి గురువులోనూ వేదవ్యాసుడి అంశ ఉంటుంది. వ్యాసాయ విష్ణు రూపాయ వ్యాసరూపాయ విష్ణవే. నమోవై బ్రహ్మనిధయే వాసిష్టాయ నమోనమః

❊ ❊ ❊

ఆదిశంకరుడి నుంచి ఆధునిక గురూజీల దాకా... ఎందరో సద్గురువులు ప్రజల అజ్ఞానాన్ని తొలగించారు. మూఢత్వాన్ని వదలగొట్టారు. భ్రమల్ని బద్దలు కొట్టారు. మంచిని చాటారు. మానవతను నాటారు. ఒకరు కాషాయం ధరించి వుండవచ్చు. ఒకరు దిగంబురులో అర్ధదిగంబరులో కావచ్చు. మరొకరు బిక్షాపాత్రతో ఫకీరులా ఉండవచ్చు. ఒకరు శూన్యంలో చేతలూపుతూ మార్మికంగా మాట్లాడవచ్చు. ఒకరు మౌనభాషలోనే సంభాషించవచ్చు. సద్గురువులు ఒక్కొక్కరు ఒక్కోలా మన జీవితాల్ని ప్రభావితం చేస్తారు. వారి ప్రతిమాటా జీవన విధానమూ ఓ అమూల్య సందేశమే.



సద్గురువు పాదపూజలను కోరుకోడు. పూర్ణ కుంభస్వాగతాన్ని ఆశించడు. ఆడంబరాల్ని మెచ్చుకోడు. పొగడ్తల్ని ప్రోత్సహించడు. హృదయపూర్వ సమర్పణను మాత్రమే ఆకాంక్షిస్తాడు. సత్యాన్ని గౌరవిస్తాడు. తన శిష్యప్రశిష్యులూ ఆ మార్గంలోనే నడవాలనుకుంటాడు. అదే ఆయనకు గురుదక్షిణ. అదే గురుశిఖర ప్రదక్షిణ.

శ్రమలోనే దైవం

షిర్డిసాయికి సొంతిల్లు లేదు. పాడుబడిన మసీదే ఆధారం. బిక్షే ఆధారం. ఓ పొయ్యి, ఓ తిరగలి, ఓ కుండ, ఓ సంచీ ఇంతకంటే ఆస్తులేమున్నాయి. అయినా సాయి కళ్ళలో ఎంత తేజస్సు, సాయి మొహంలో ఎంత ఆనందం! పసివాళ్ల మధ్య పసివాడిలా మెలిగేవారు. పిల్లలతో గోళీకాయలు ఆడేవారు. మేధావుల మధ్య మేధావిలా మెలిగేవాడు. వేదాంత రహస్యాలు బోధించేవారు. ఖరీదైన యజ్ఞయాగాల్నీ ఆడంబరమైన పూజాదికాల్నీ బాబా ఖండించారు. అన్ని దానాల్లోకీ అన్నదానం గొప్పది. ఆకలితో ఉన్నవారికి రెండు ముద్దలు పెడితే అల్లా మనకి వంద ముద్దలు పెడతాడు అని చెప్పాడు.

షిర్డిసాయి అదృష్టాన్నీ అయాచిత ఫలాల్నీ ఎప్పుడూ ప్రోత్సహించలేదు. కుశాల్‌చంద్ అనే వ్యక్తి ద్వారకామాయిలో ఉండేవాడు. ఏ పనీ చేసేవాడు కాదు. ప్రసాదాలతో కడుపు నింపుకుంటూ ఓ మూలన కునుకుపాట్లు పడేవాడు. బాబా అతని పరిస్థితిని గమనించారు. ఓసారి, తన దగ్గరికి పిలిచి 'ఊళ్లో నీకు పొలం ఉందిగా, పంటలెలా పండుతున్నాయ్" అని అడిగారు. ఏం చెప్పమంటారు బాబా! బీడుపడిపోయింది" దిగాలుగా చెప్పాడు కుశాల్. 'అవునా అందులో లంకెబిందెలుండాలే! కావాలంటే దున్ని చూడు!" అన్నారు బాబా. ఆ మాట వినగానే కుశాల్ సంబరపడిపోయాడు. వెంటనే సొంతూరికి బయల్దేరాడు. వెళ్లిన మనిషి, అంతే వేగంగా తిరిగొచ్చాడు. బాబాకి అర్థమైపోయింది.

"లంకెబిందెలు దొరకలేదా పొలాన్ని ఎలా దున్నావేమిటి?" అని వాకబు చేశారు.

"నిలువునా దున్నాను బాబా" నిరాశగా చెప్పాడు కుశాల్.

"అదీ సంగతి! ఈసారి అడ్డంగా దున్ను తప్పకుండా దొరుకుతాయి. ఈరోజే బయల్దేరు" తొందరపెట్టారు బాబా.

రెండ్రోజుల్లో తిరిగొచ్చి "నా శ్రమంతా వృథా అయింది. ఎంత దున్నినా ఒక్క లంకె బిందె కూడా దొరకలేదు." ఘొల్లుమన్నాడు.

"నీ కష్టం ఊరికేపోదు. ఎలాగూ దున్నేశావు కాబట్టి మిరప పండించు" సలహా ఇచ్చారు బాబా.

ఆ ఆదేశాన్ని పాటించాడు. పంట విరగబడింది. మంచి ధర వచ్చింది. డబ్బు మూటలు తీసుకొచ్చి బాబా పాదాల ముందు పెట్టాడు కుశాల్.

"ఇవే లంకెబిందెలు. భక్తిముసుగులో సోమరితనం కుదరదు. పనిలో పరమాత్ముడిని దర్శించు" ఆశీర్వదించి పంపారు బాబా.

సాయి ఆచరించిందే చెప్పారు... చెప్పిందే ఆచరించారు. తానెప్పుడూ వృథాయాపన చేయలేదు. మొక్కలకు నీళ్ళు పోస్తూనో, మసీదు శుభ్రం చేస్తూనో కాలం గడిపేవారు. ఆరాధించడం అంటే పనిని ప్రేమించడమే. కర్తవ్యంలో దైవాన్ని చూడటమే. అదే సాయితత్వం!

అంతా ఆత్మ స్వరూపులే..

ఓ వ్యక్తిని గేటు బయటే నిలబెట్టి మాట్లాడతాం. ఓ వ్యక్తిని గడపదాకా రానిస్తాం. ఓ వ్యక్తిని డ్రాయింగ్ రూమ్‌లో కూర్చోబెట్టి కాఫీ ఇస్తాం. ఓ వ్యక్తిని భోజనం గదిలోకి తీసుకెళ్లి, కొసరి కొసరి వడ్డిస్తాం.

మనం గౌరవించాలటే ఎదుటి మనిషిలో ఎన్నో అర్హతలుండాలి. మనం పలకరించాలంటే సదరు వ్యక్తితో ఎంతోకొంత అవసరం ఉండాలి. ప్రయోజనం లేకపోతే, చిరునవ్వునైనా వృథా చేసుకోం.

ఎదుటి మనిషిలోని గొప్పదనాన్ని గుర్తించడం ఎలాగో రామకృష్ణ పరమహంస తనదైన పద్ధతిలో బోధించారు. రామకృష్ణుల దగ్గరకి ఓ భక్తుడు వచ్చేవాడు. అతనితోపాటు లాటూ అనే పనివాడూ వచ్చేవాడు. 'మీరు అనుమతిస్తే లాటూను నా దగ్గరే ఉంచుకుంటా" అని భక్తుడితో రామకృష్ణ పరమహంస చెప్పారు. ఆయన సంతోషంగా అంగీకరించారు.

లాటూ పెద్దగా చదువుకోలేదు. దానికి తోడు మతిమరుపు. ఏ విషయమైన ఒకటికి పదిసార్లు చెప్పాల్సిందే. కొద్ది రోజులకే గురువుగారి తల్లో నాలుకగా మారిపోయాడు.

"లాటూలో ఏవి ప్రత్యేకత ఉందని ఇంత ప్రాధాన్యం ఇస్తున్నారు?" అడిగారెవరో. "ప్రేమ" స్పష్టంగా చెప్పారు రామకృష్ణులు. గురువుల సాహచర్యంలో లాటూ ఎంతో పరిణతి సాధించాడు. కొంతకాలం తర్వాత సన్యాస దీక్ష స్వీకరించాడు. అంతా ఆయన్ను అద్భుతానంద అని పిలిచేవారు.

లాటూ అనే అమాయకుడిలో సర్వసంగ పరిత్యాగి లక్షణాల్ని గుర్తించిన పరమహంస నరేన్ అనే యువకుడిలో అసాధారణ ప్రజ్ఞను దర్శించారు. ఆధ్యాత్మిక శక్తి కేంద్రంగా తీర్చిదిద్ది స్వామి వివేకానంద అన్న పేరుతో జాతికి అందించారు. సమస్యలకు భయపడి పారిపోవడం కాదు. ఎదిరించి నిలవండి. పోరాడండి" అంటూ గీతలో కృష్ణభగవానుడిలా నిర్భయత్వాన్ని బోధించాడు వివేకానందుడు. భార్యగా తన జీవితంలోకి అడుగుపెట్టిన శారదామాతలో నిబిడీకృతంగా ఉన్న ఆధ్యాత్మిక శక్తిని వెలికితీశారు రామకృష్ణులవారు. ఆమెను కాళీమాత అవతారంగా ప్రస్తుతించారు. ఆ ప్రోత్సాహంతో శిష్యులకు మంత్రదీక్ష ప్రసాదించగలిగే స్థాయికి ఎదిగారామె. 'సమతా పశ్యన్ హి సర్వత్ర సమవస్థితమ్. ఈశ్వరమ్" అందరిలోనూ సమపాళ్ళలో ఉన్న ఈశ్వరుడిని చూడటం సద్గురువు ప్రత్యేకత. ●

మహాతాత్వికవేత్త
జిడ్డు కృష్ణమూర్తి



జిడ్డు కృష్ణమూర్తి నూరుపైసాల తెలుగువాడు. మానసిక తత్త్వ విశ్లేషణపై- ఆయనెంతో ప్రయత్నం చేసారు. ఎన్నో గ్రంథాలను రచించారు.

మదనపల్లిలో ఆయన స్థాపించిన శాంతి ఆశ్రమం రవీంద్రుని శాన్తిధామం వంటిది. ఇప్పటికీ ఆయన శిష్యప్రశిష్యవర్గం ఆయన జాడల్లోనే నడుస్తున్నారు. విదేశాల్లో కూడా ఆయన అనుయాయులు ఉన్నారు. మానవతకు మరో కోణంలో తన దృక్పథాన్ని విశదీకరించారు. తన ప్రత్యేకతను విశ్లేషించిన ధీరోదాత్తుడు.

మనిషి జీవితంలో అనేక అనుభవాలు ఉంటాయి. అవి మదిలో నిలిచిపోతాయి. నిధిలా మనసులో ఉండే ఆ జ్ఞాపకాలు, ఒక్కోసారి ప్రస్తుత క్షణాలవైపు ఎదురీదుతూ వస్తాయి. 'అలా వెనక్కి రావడమే ఆలోచన' అని జిడ్డు కృష్ణమూర్తి అనేవారు. అంటే అనుభవమే ఓ జ్ఞాపకంగా, ఆలోచనగా రూపాంతరం చెందుతుందన్న మాట సత్యం.

అనుభవాలు, జ్ఞాపకాలు ఆలోచనలు నిండిన మనసుకు విశ్రాంతి ఉండదు. మానవ జీవన ప్రయాణంలో కొన్ని అనుభవాలు మధురానుభూతులు కలిగిస్తాయి. అవే అనుభవాలు ఆ తరవాత ఎప్పుడైనా అతడికి జ్ఞప్తికి వస్తుంటాయి. వాటి రుచినెరిగిన మనసు మళ్లీ అవే అనుభవాలు కావాలని కోరుతుంది. అది మనసు నైజం. మనిషి కోరిక ఏదైనా కావచ్చు. ఒక పని మొదలవుతుంది. కచ్చితంగా ఏదో ఒక ఫలితం వస్తుంది. అది ప్రకృతి సూత్రం.

లభించిన ఫలితం- ఆశించిన ఫలితం కంటే భిన్నంగా ఉంటే, మనసులో కొంత శూన్యత ఏర్పడుతుంది. ఆ శూన్యభాగాన్ని పూరించేందుకు మరిన్ని ఆలోచనలు కలుగుతాయి. ఒక ఆలోచన మరొక దానితో ఢీకొంటుంది. అప్పుడు అక్కడ మానసిక రణరంగం ఏర్పడుతుంది. ఆ మానసిక అలజడినే తత్వవేత్తలు 'దుఃఖం' అన్నారు.

దుఃఖం అంటే, ఆనందం లేకపోవడం, ఆనందం ఎప్పుడు ఉంటుంది? అది వర్తమానంలో ఉంటుంది. జరిగినదానికి సంబంధించి దిగులు లేనప్పుడు, రేపు ఏమవుతుందో అనే భయాందోళన ఉండనప్పుడు, ప్రస్తుతంలో జీవిస్తున్నప్పుడే ఆనందం ఉంటుంది. ఇంతటి సునాయాసమైన జీవన సూత్రం వదిలేసి మనిషి దుఃఖంలోనే కొట్టుమిట్టాడుతున్నాడు. స్వార్థపూరిత ఆలోచనలు, అసూయా ద్వేషాల వంటివే అతణ్ణి దుఃఖానికి గురిచేస్తున్నాయి.

ఆనందంగా, ఆరోగ్యంగా ఉన్న వ్యక్తిని చూసి కొందరు అసూయపడతారు. దుఃఖంలో ఉన్న వ్యక్తిపై ఎవరు 'దాడి' చేస్తారు? చిన్నప్పుడు పిల్లలు ఏడిస్తే తల్లిదండ్రులు వాళ్లను దగ్గరకు తీసుకుంటారు. వారికి కావల్సినవన్నీ కొనిపెడతారు. ఇంట్లో ఎవరైనా అనారోగ్యంపాలై బాధపడుతుంటే, అందరూ అతడిపై ప్రత్యేక శ్రద్ధ చూపుతారు. సేవలందిస్తారు. బంధువులు, స్నేహితులు అతడి చుట్టూ చేరతారు. ఎంతో ధైర్యమిస్తారు. ఓదారుస్తారు. అప్పుడు అతడు తాను ఒంటరివాణ్ని కాదనుకుంటాడు. తనకు ఎంతో మంది ఉన్నారని గుండె దిటవు చేసుకుంటాడు. 'ఇంతమందిని నా దరికి చేర్చింది దుఃఖమే కదా' అనుకుంటాడు. అలాంటి అనుభవాల్ని చవిచూసిన కొద్దీ, అతడిలో ఆ భావన మరింత బలపడుతుంది.

దుఃఖంతో నిండిన మనసు, మనిషిని దుర్బలుణ్ని చేస్తుంది. స్వార్థపూరిత ఆలోచనలు కలిగించి, అతడితో హానికర పనులు చేయిస్తుంది. అతడు కుటుంబానికి, సమాజానికి పనికిరానివాడవుతాడు. అతడి అసలు స్వరూపం బయటపడ్డాక, సమాజం అటువైపు చూడటం మానేస్తుంది. చివరికి ఆ మనిషి ఒంటరిగా మిగిలిపోతాడు. మరింత దుఃఖితుడవుతాడు. ఆ బాధనుంచి ఉపశమనం పొందడానికి ప్రయత్నాలు మొదలుపెడతాడు.

ఆ ప్రయత్నాల్లో అతడు ముందుగా చేయాల్సింది- ఒక మంచి పని ఎంచుకొని అందులోనే నిమగ్నం కావడం. ఆ పని తనకు, సమాజానికి ఉపయోగపడేలా చూసుకోవడం. జరిగిపోయినదాని గురించి తలపోస్తూ కూర్చోకూడదు. వర్తమానంలోనే ఉంటూ, ఉన్నదాంతో సంతృప్తిగా జీవించాలి. జీవితానికి మనసే మూలం. అది గతంలో చేసిన పనులతో విచలితమై ఉంటుంది. ఆ మనసు తిరిగి ప్రశాంతత పొందేందుకు, ధ్యాన్య ప్రక్రియ చేపట్టడం ఒక్కటే మార్గం!

మోడువారిని చెట్టు కొంతకాలానికి చిగురిస్తుంది. వసంత రుతువు వచ్చి ప్రాణం పోయడమే దానికి కారణం. ధ్యాన్యం, వసంత రుతువు వంటిది. దుఃఖంతో, మానసిక గాయాలతో కుంగిపోయిన మనిషిలో ఆనందాన్ని ధ్యానమే నింపుతుంది. అదే అతణ్ని మనిషిగా నిలబెడుతుంది!

(శ్రీ మునిమడుగుల రాజారావుకు కృతజ్ఞతలతో)

రుచికి, సువాసనకి, ఆరోగ్యానికి నాణ్యమైన
"అజంతా"
వక్కపొడి
రవికుమార్ అండ్ కంపెని - చెన్నై
044 25204046, 26171341

భూమన కరుణాకరరెడ్డి పూర్తి రాజకీయాలలో పాల్గొంటున్నందున ప్రపంచ విఖ్యాతిగన్న తెలుగు మహాసభలు బోసిపోయాయ్!

-ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం స్వయంగా కర్తృత్వం వహించిన మహాసభలు సహితమూ కళను కోల్పోయాయ్!!-

ఒక్కొక్కరు ఒక్కొక్క రంగంలో తమ తమ ప్రావీణ్యతను చిత్తశుద్ధితో పట్టుబట్టి విజయాలను సాధిస్తారు! అందరినీ విజయోత్సాహుల్ని చేస్తారు.

ప్రపంచంలోని మారుమూల దేశాల్లో కూడా తెలుగువారున్నారు. వారు మాతృభాషాభిమానంతో తెలుగు భాషామహాసభలను బాధ్యతాయుతంగా జరుపుతున్నారు. నేను చాలా దేశాల్లో జరిగిన మహాసభల్లో పాల్గొన్నాను. వారి చిత్తశుద్ధినీ, అంకితభావాన్నీ అభినందించాను. ఒక్కొక్కప్పుడు సభ్యత్వ, ప్రవేశత్వం కోసం డబ్బు చెల్లించనవీ, ఆహ్వానితునిగా వెళ్ళినవీ ఉన్నాయ్.

తుడా చైర్మన్‌గా, తిరుమల తిరుపతి దేవస్థానం పాలకమండలి అధ్యక్షునిగా భూమన కరుణాకరరెడ్డి అనన్యమైన కృషినీ, అన్యోన్య భావాన్నీ కనులారా వీక్షించిన వాణ్ణి. ప్రపంచమెల్లలా ఉన్న తెలుగు మహాసభలను చూచినవాణ్ణి.

భూమన కరుణాకరరెడ్డి నిర్వహించినట్లుగా నిర్వహించినవారు లేరు. భారతదేశంలోని వారే గాకుండా ప్రపంచ దేశాల్లోని తెలుగు ప్రముఖులు, కళాకారులు కళారాధకులు, కళాపోషకులు ఈ మహాసభల్లో పాల్గొన్నారు.

తిరుపతిలోని ప్రతీ దీపస్తంభము, టెలిఫోను పోస్టు, ప్రతీరహదారీ తెలుగు తోరణాలతో ప్రతిభాశాలురకు స్వాగతవచనాలతో నిండిపోయింది. ఎంతోమంది పెద్దలను గుర్తు చేస్తూ స్వాగత ద్వారాలను ఏర్పాటు చేసారు. తిరుపతిలోని ప్రతీ అణువూ తెలుగుదనంతో పులకరించి పోయింది.

ప్రవేశరుసుము లేదు. భోజన ఉపహారములను ఉచితంగా అందచేసారు. వివిధ రంగాలకు చెందిన పెద్దలందరినీ పిలిపించారు. క్రమశిక్షణగల వాలంటీర్లు ఆహ్వానితులకు ఏ ఇబ్బందీ కలుగని సిబ్బందిలా పనిచేసారు. కళాసాహితీ సాంస్కృతిక సమావేశాల కొరతే లేదు. తిరుపతి గోవిందరాజ క్షేత్రమంతా మా తెలుగు తల్లికి మల్లెపూదండ అంటూ పులకరింపచేసిన ఘనత భూమన కరుణాకరరెడ్డి కొక్కరికే దక్కింది. ప్రేమ యెప్పుడూ, వాత్సల్యమూ కరుణ ఉన్నప్పుడే సిద్ధిస్తుంది. అందుకే నేను 'కరుణాకరా! నీకీ పేరు ఏ శుభముహూర్తములో పెట్టారురా' అని మనసారా ప్రశంసించాను.

ముఖ్యంగా యువతరాన్నుంచీ వృద్ధతరం వరకూ- యింకా వివరించాలంటే ఆబాలగోలపాలమూ ఈ సభల్లో పాల్గొనేట్లు చేసిన ఘనత కరుణాకరరెడ్డిదే!

అటు తరువాతగానీ, పూర్వంగానీ అలాటి తెలుగు మహాసభలు జరిగాయని- నేనెవరి నోటా వినలేదు. ఎవరూ జరుపలేదు. అలాటి భూమన వంటి మహా మనుషులున్నట్లు నా మనో పరిధిలో స్ఫురించలేదు.

అలాటి భూమన కరుణాకరరెడ్డి సింధూరనామం చెరుపుకుని పూర్తి రాజకీయాల్లో నిమగ్నుడయ్యారు. శ్రీకృష్ణదేవరాయలు తరువాత తెలుగుతనం వెలుగును కోల్పోయినట్టు అలాంటి ప్రపంచ తెలుగు మహాసభలను తిరిగి దర్శించగలమా- యని మనసు వేదనపడుతున్నది.

శ్రీనివాసుడు ఏడుకొండలపై నుండీ, గోవిందరాజులు తిరుపతిలో ఉండీ- ఇలాంటి బృహత్తెలుగు మహాసభలను జరిపే విధంగా ఆశీర్వదించవలెనని అన్నదమ్ములను విధేయంగా ప్రార్థిస్తున్నాను.

రాజకీయాల్లో ఉంటూనే వై.యస్. రాజశేఖరరెడ్డి, తన పంచె, చొక్కా, కండువా ధారణను తెలుగు భాషోన్నతినీ కాంక్షించినట్టు భూమన కరుణాకరరెడ్డి కూడా తన బాధ్యతను నెరవేరుస్తారని ఆశిద్దాం. ●

తెలుగువారి గౌరవాన్ని, భాషనూ తెలుగువారు కాపాడుకోవాలి!

మనం తెలుగు వాళ్ళం. మన భాష తెలుగు. మన భాషలో సౌజన్యం ఉన్నది. మాధుర్యమున్నది. అన్య భాషీయులు తెలుగును అమేయంగా అభిమానించిన చరిత్ర ఉన్నది. మనిషియైనవాడు మన జాతి, మన భాష అన్న మమకారం కలిగి ఉంటాడు. తెలుగు జాతి ఉనికి తెలుగు భాషాధ్యయనంలోనే ఉంది; భాషించడంలోనే ఉన్నది. ప్రవృత్తి మార్గంలో నేను తెలుగువాడిని, నా నాడిలో తెలుగు ప్రతిధ్వనిస్తూనే ఉంటుంది. లోక వ్యవహారానికి ఎన్ని భాషలనైనా నేర్వవచ్చు. మాట్లాడవచ్చు. కాని తల్లి భాషను మరిచినవాడు తల్లిని మరచినంతటి ఘాతకుడు. బంగాళీలు బంగాళీ భాషను మరువనట్టు తమిళులు తమిళ భాషను మరువనట్టు – తెలుగువాడు తెలుగు భాషను కలలోనైనా మరువరాదు. నేను, నాదియను మనసు, ధృఢ తరమైనపుడు నా భాష అను ధృఢతరమైన భావన ఎందుకు కలుగదు. తెలుగుభాష సరస్వతి వాగ్విలాసం. స్వయంభువు కాబట్టి అసూయా జనకమైన మాధుర్యం ఉట్టిపడుతూ ఉంటుంది. జాతి, భాష, దేశం అను మూడూ అన్యోన్యమైనవి. ఈ మూడు కలిస్తేనే భాషకు సంపూర్ణత కలుగుతుంది. ఇందే భిన్నత్వం కలిగినా, భాష వికృతమవుతుంది. క్రమక్రమంగా అదృశ్యమవుతుంది.

మానవజాతి అంతా ఒక్కటైనప్పటికినీ, భాషను బట్టి భావన, భావనను బట్టి జాతి ఉంటుంది. భాష లేకుండిన, ఆ జాతి లేనట్టే ఉంటుంది. ధృఢమైన జీవనాడి ప్రచులితమవుతుంది. మహోజ్వలమైన సింహ పీఠమ్మీద తెలుగు ఉన్ననాడు, తెలుగుభాష ఉంటుంది. సింహనాదంగా ప్రపంచంలో తెలుగుకు సింహస్థానం కలుగుతుంది. ఎంతగా ఎవ్వరు పీకలు పిసుక్కున్నటికినీ తెలుగుకు పిసరంత నష్టం ఉండదు. అంటే తెలుగు వాడిలో ఈశ్వర నిర్దేశమైన తెలుగుకు ధోకా ఉండదు. ●

బతుకుబాట 84 సంవత్సరములు!
పయనించిన సినిమా బాట 48 సంవత్సరములు!!
ఎస్వరలక్ష్మిగా ఎందరి మనములందు ఎన్ని సంవత్సరములుగా జీవిస్తున్నదో!!!

'ఎవరినే నేనెవరినే– ఎవరెరుగని దాననే ఏమో తెలియని దాననే' తన స్వరమధురిమతో తానే ప్రశ్నించుకుని సమాధానపడింది.

'ఓ బాలరాజా! జాలిలేద బాలరాజా! నా బాలరాజా! ఈడుజోడు కానా! నీదాననోయి– జానా వదలకు రాజా! నన్నొదలకు రాజా! బాలరాజా!' అంటూ తెరపై సహజస్వరంతో ప్రేమసరములను పల్లవించిన 'ఎస్వరలక్ష్మి'ని ఎందరు మరువగలరు?

తెరపైనే గాకుండా తెరబయట కూడా బాలరాజు పాత్రధారి అక్కినేని నాగేశ్వరరావుతో యీ బాల స్వరలక్ష్మికి మధ్య ప్రేమలు గుసగుసలాడెనని 'గాసిప్పు'లను సృష్టించారు. అక్కినేనికి అన్నపూర్ణతో వివాహం జరిగి, వివాహవేడుకల వేదికపై ఎ.స్వరలక్ష్మి గళం విప్పారి గాన సుధాసభ జరిగే వరకూ సాగుతూనే ఉన్నాయ్.

రతిరాజసుందరా, రణరంగధీరా! కమల బాంధవతేజ కరుణాల వాల! యని మగువ మాంచాల బాలచంద్రుణ్ణుద్దేశిస్తూ– తెరపై మరులుగొలిపేవరకూ ఊహలు గుసగుసలాడియాడి గుస్సయ్యాయి.

ఎస్ 'స్వర' వరలక్ష్మి

ఓ బాలరాజా పాట జనంలో ఇప్పటికీ గుర్తుంది. బాలనటగాయనిగా పరిచయమై, అక్కినేని సరసన అందాల నాయికగా నటించి, తెలుగు చలనచిత్ర స్వర్ణయుగంలో తొలిహిట్ పెయిర్‌గా పేరు పొంది, విభిన్న రసాల రాగాలను రాగమాలలను తన స్వరం నుండి అలవోకగా ఆలపించిన గాయనిగా విభిన్న పాత్రలకు జీవం పోసిన కథానాయకిగా మనకళ్లముందు పౌరాణిక పాత్రలను సాక్షాత్కారింపజేసిన ఆ మహానటి యస్. వరలక్ష్మి.

1927లో జగ్గంపేటలో (తూర్పుగోదావరి) వరలక్ష్మీ వ్రతం రోజున జన్మించిన కారణంగా వరలక్ష్మి అని పేరును పెట్టారు. నాలుగవ ఏట నుండి కర్నూలులో పెద్దమ్మగారింట పెరిగింది. పెద తండ్రి దగ్గర సంగీతాభ్యాసం చేసిన వరలక్ష్మిని, పదేళ్ళ లే బ్రాయంలో 1937వ సంవత్సరంలో 'బాలయోగిని' సినిమాలో బాల నటగాయనిగా పరిచయం చేసి గూడవల్లి రామబ్రహ్మంగారు 1945లో 'మాయలోకం' సినిమాలో అక్కినేని సరసన నాయికగా నటింపజేశారు. తరువాత పల్నాటియుద్ధంలో మగువమాంచాలగా, 'బాలరాజు'లో సీతగా, 'సౌదామిని'లో సౌదామినిగా అక్కినేనితో కలిసి నటించడమే గాక ఆయనతో కలిసి యుగళ గీతాలు ఆలపించారు.

నటరత్న నందమూరితో కలిసి 'బభ్రువాహన'లో చిత్రాంగద, 'శ్రీకృష్ణార్జున యుద్ధం'లో సత్యభామగా, 'సత్యహరిశ్చంద్ర'లలో చంద్రమతిగా, 'శ్రీవేంకటేశ్వర మహత్యం' లక్ష్మీదేవిగా, 'మహామంత్రి తిమ్మరుసు'లో తిరుమలదేవిగా నటించారు.

శివాజీగణేశన్ సరసన 'వీరపాండ్యకట్టబ్రహ్మన్న' చిత్రంలో కట్టబ్రహ్మన్న భార్య 'జంగమ్మ'గా నటించి విదేశీయుల ప్రశంసలను పొందటం విశేషం. 'ఈచిత్రం కైరో చలనచిత్రోత్సవంలో ప్రదర్శితమయినపుడు ఆమె పాటలు విని నటనను మెచ్చి న్యాయనిర్ణేతలు ప్రత్యేక ప్రశంసా పత్రాన్ని పంపడం తన నటనజీవితంలో మరపురానిదని ఆమె అనేవారు.

చిత్రనిర్మాతగా కూడా ఈమె పాత్ర ప్రత్యేకమయినదే. 1957వ సంవత్సరంలో 'శ్రీవరలక్ష్మి పిక్చర్స్' నిర్మాణ సంస్థను స్థాపించి – అక్కినేని కథానాయకుడిగా 'సతీసావిత్రి' చిత్రాన్ని నిర్మించారు. ఈ చిత్ర నిర్మాణంలో కొన్ని ప్రత్యేకతలున్నాయి. ఆధునికయుగ వాగ్గేయకారుడయిన డా. మంగళంపల్లి బాలమురళీకృష్ణగారిని 'సతీసావిత్రి' సినిమా ద్వారా సినీ నేపథ్య గాయకునిగా, సినీ సంగీత దర్శకునిగా పరిచయం చేసిన తెలుగు సినిమా చరిత్రలో నూతన ప్రస్థానానికి శ్రీకారం చుట్టారు. 'సతీసావిత్రి'కి 8 మంది సంగీత దర్శకుల చేత స్వర రచన చేయించిన నిర్మాత కూడా! 'బభ్రువాహన' చిత్రాన్ని ఎన్టీఆర్‌తో నిర్మించారు. నిర్మాతగా ఈమె 'బభ్రువాహన' చివరిచిత్రం.

'మీనా' చిత్రంలోని గడుసు అమ్మ పాత్ర కూడా విలక్షణమయినదే. 'ముద్దులకృష్ణయ్య' తెలుగు చివరి చిత్రం కాగా. కమల్‌హాసన్ 'గుణ' డబ్బింగ్ తెలుగు చిత్రాలలో చివరిది కావడం ఒక విశేషం. ఇక గాయనీమణిగా ఆమె ప్రస్థానంలోకి తొంగి చూస్తే... నిజంగా "ఆమె... ఎస్. వరలక్ష్మి... అంటే స్వసరాల సురాగాల వరలక్ష్మి. 'రతిరాజ సుందరా! రణరంగధీర' 'ఓహో! చారుశీలా... ఓహోహో బాలవీర" (పల్నాటియుద్ధం), 'ఎవరినే నేనెవరినే'. 'రాజారారా! నా రాజారారా!', 'పతి రూపము నీయరయా' (బాలరాజు), వంటి ముగ్ధనాయిక ఆలపించే వైవిధ్య భరిత గీతాలను అద్భుతంగా ఆలపించారు. మలి ప్రస్థానంలో 'తిరుమల తిరుపతి వేంకటేశ్వరా' 'లీలాకృష్ణా. నీ లీలలు' (మహామంత్రి తిమ్మరుసు' 'వరాల బేరమయా... వనరౌ బేరమయా' 'శ్రీదేవిని నీదు దేవేరిని (శ్రీవేంకటేశ్వర మహత్యం) 'నమో భూతనాథా, నమో దేవదేవా' (సత్యహరిశ్చంద్ర) పాటలీనాటికీ జనరంజక మవుతూ ఉన్నాయి.

ఈ విధంగా తెలుగు చలనచిత్ర చరిత్రలో బాలనటగాయనిగా పరిచయమై ముగ్ధనాయికగా స్వర్ణయుగంలో శోభిల్లి కోయిలొకసారొచ్చి కూసిపోయినది అంటూ కోయిల గీతా లాలపించి నాయికగా, అమ్మగా, అత్తగా, విభిన్న తరహా పాత్రలను సాంఘిక, చారిత్రక, పౌరాణిక చిత్రాలలో పోషించిన గుణచిత్ర నటిగా ఎస్.వరలక్ష్మి స్థానం అద్వితీయం. అపూర్వం. ●

Compliments from

Sri Krishna Bhat

When you come to
Holy Pilgrimage Centre Tirupati & Tirumala

WOOD SIDE ANNEXE

Opp. to Govindarajulu Temple, 20. E.car Street, Tirupathi.

WOODSIDE
HOTEL WOODSIDE

E.Car Street, Tirupathi. Ph : 2284464

సకల సౌభాగ్య వరప్రసాదుడు

సకల నరసింహులు చెట్టి!



కొందరికి ఐశ్వర్యం మదాంధతను కూరుస్తుంది. కొందరికి మహద్దాన గుణం అలవరుస్తుంది. జ్ఞానరూపుడైన భగవంతుడెవరిని యెలా పరిరక్షించాలనీ, సమాజ శ్రేయస్సెలా పెంపొందుననీ– ఆయన సర్వదా పరీక్షిస్తూ ఉంటాడు.

పూర్ణ పురుషుడు భగవానుడు. పూర్ణ అను విశేషణమూ, విశ్లేషణమూ ఆయనకే చెందుతుంది.

సర్వ వ్యాపకుడూ, సర్వ సంపన్నుడు సర్వజ్ఞుడైన భగవంతుని కృపతోనే అర్ధభాగపు కటాక్షమును మనుజులు పొందకలుగుతున్నాము. అలా పొందిన అర్ధభాగాన్ని సమాజహితైషిగా ఖర్చుపెడుతున్న వాణ్ని ధార్మికుడంటున్నారు.

సకల ఇంటిపేరులోని సౌభాగ్యమేమోగానీ– సకల నరసింహులు చెట్టి సకల సౌభాగ్యవర ప్రసాదుడని చెప్పడమొప్పుతున్నది. సకల ఐశ్వర్యములూ తానే అనుభవించాలనెడి భావన లేదు. పరిచయమైన వ్యక్తి పదే పదే వస్తున్నా విసుగుచెందదు. ఉదాశీనంగా ఉండడు. వ్యాపారం చూసుకుంటూనే అతిథిని గౌరవిస్తాడు. అతిథి మర్యాదలను ఆయన్నుండే నేర్చుకోవాలి.

నిరాడంబరుని మనసులోని మాట చీకూచింతలెరుగని

చిలుకూరు వేంకటేశ్వర్లు

సుమారు 50,60 సంవత్సరాలపాటు చెన్నైలో ఉంటూ పరిశ్రమనొకటి స్థాపించి దాన్ని నిర్వహించడంలోనే సరిపోయేది. ఉన్నంతలో సమయం చూసుకొని సాహితీవేత్తలైన శ్రీ ముళ్లపూడి రమణ, శ్రీ పురాణం సుబ్రహ్మణ్యశర్మ, శ్రీ ఆరుద్రవంటి వారితో పరిచయాలు కలిగి వుండేవాడిని.

ఈ చిరుగ్రంథాన్ని వ్రాయడంలో విషయ సేకరణకు తోడ్పడ్డ గ్రంథ కర్తలలో శ్రీయుతులు ఆరుద్రగారితో నాకు ప్రత్యక్షంగా పరిచయం ఉండటం నా అదృష్టంగా భావిస్తున్నాను. వారితో నాకుండిన పరిచయాన్ని రెండు మాటల్లో చెప్పాలని ఉంది.

చెన్నైలో టి. నగర్ క్లబ్ తమిళనాడు బ్రిడ్జ్ అసోసియేషన్‌కు కేంద్రస్థానం. శ్రీ ఆరుద్రగారికి బ్రిడ్జ్ ఆరవ ప్రాణం. వారు చెన్నైలో ఉంటే సాయంత్రం 6 గంటలకల్లా మా క్లబ్‌కు వచ్చేవారు. నేను కూడా అదే సమయానికి క్లబ్‌కు చేరేవాడిని. ఆయన పార్ట్‌నర్స్ శ్రీయతులు కె.ఎస్. ప్రకాశరావు, చలనచిత్ర దర్శకులు, శ్రీఅగర్వాల్, కంటి శస్త్రచికిత్స నిపుణులు, శ్రీ రామకోటేశ్వరరావు, ఇన్‌కంటాక్స్ కమిషనర్ వంటి వారందరితోపాటు శ్రీ ఆరుద్రగారితో కూడా కలిసి కాసేపు పిచ్చాపాటీ మాట్లాడుకుని ఎవరిదారిన వారు ఆటలో నిమగ్నమయ్యేవాళ్ళం. ఈ విధంగా 35/40 సంవత్సరాల వారి సాన్నిహిత్యాన్ని స్మరించుకోవడం సంతోషంగా ఉంది.

అనేకమంది సాహితీవేత్తలతో నాకు పరిచయ భాగ్యం కలిగినా ప్రత్యక్షంగా నాకు సాహిత్యంలో ప్రవేశం ఉండేది కాదు. 60 సంవత్సరాలు నిండగానే వ్యాపారాన్ని, సంసార బాధ్యతల్ని ముగించుకొని తర్వాత నా గురుదేవులు శ్రీరామకృష్ణ పరమహంసల వారి నాశ్రయించాను. వారి అనుగ్రహంతో కొన్ని గ్రంథాల్ని తెలుగులోను, ఇంగ్లీషులోను వ్రాసి వారి వెబ్‌సైట్‌లో వుంచాను. వారి ఆదేశం ప్రకారమే తెలుగు సాహిత్యంలో పాలు పంచుకున్న ఆణిముత్యాల గూర్చి పై తరాలవాళ్ళకు తెలియజెయ్యాలన్న తపనే ఈ ప్రయత్నమును క్లుప్తంగా వివరించడం జరిగింది. – చిలుకూరు వెంకటేశ్వర్లుకు కృతజ్ఞతలతో వారి భాషణ సారాంశమే ఈ వ్యాసం.

అలుపెరుగని నటుడు!
విద్యార్థుల శ్రేయోగాముడు!
విశిష్ట లక్షణ నటుడు ప్రతిభా స్వభావుడు
మోహన్‌బాబు

40 సంవత్సరాలు సినిమారంగంలో నలుసంత కూడా గర్వంలేనివాడు! నిర్మొహమాటంగా మాట్లాడుతాడు; కడుపులో ఏ మాటా దాచుకోడు! మంచివాళ్లకు మంచివాడు. ఏ రంగంలోకి తాను వచ్చాడో– ఆ రంగాన్ని ఇప్పటికీ విడువలేదు.

విద్యార్థి భవిష్యత్తును కోరుతూ, చక్కటి సుబోధకరమైన, సుజ్ఞాన విద్యను గరిపే విద్యాలయాన్ని స్థాపించాడు.

ఇప్పుడు చూచినా ఆ సొగసరి నవ్వు కనిపిస్తుంది. 40 సంవత్సరాలు క్రితం సినిమారంగంలో ప్రవేశించినా, ఏ చిత్రానికి ఆ చిత్రంలో తన ప్రత్యేకతను ప్రదర్శిస్తూ వచ్చాడు. మోహన్‌బాబు సంభాషణా చాతుర్యం మోహన్‌బాబుదే! ఎవర్నీ అనుకరించడు.

మావూరివాడు, మా పాలకొల్లువాడు. దర్శకరత్న దాసరినారాయణరావు దర్శకత్వంలో నిర్మింపబడిన 'స్వర్గమూ– నరకము' చిత్రంతో రంగ ప్రవేశం చేసాడు. వచస్సులో యశస్సు చూపాడు.

సినిమా రంగంలో తాను చెమటోడ్చి సంపాదించిన ధనంతో చక్కని విద్యానిలయాన్ని స్థాపించాడు. ఆ విద్యాలయం రవీంద్రుని శాంతినికేతనంలా ఉత్తమ విద్యకు నిలిచింది. ఇంతటి ప్రజ్ఞావిశేషాలు సంపాదించిన మం(చి)చు మోహన్‌బాబుకు, విశాఖపట్నంలో టి. సుబ్బరామిరెడ్డి ఆధ్వర్యంలో 40 వసంతాల మహోత్సవాన్ని జరుపడం మహదానందం కూర్చింది. సుబ్బరామిరెడ్డి చేస్తున్న మంచి కార్యక్రమాల్లో ఇదోమంచి కార్యక్రమం.

మోహన్‌బాబు నిత్యయవ్వనుడు నమ్మినవారికి ప్రాణం యిస్తాడు. సినిమాల్లోనివారికి జయాపజయాలు సహజం. ఫిలిమ్ ఇన్‌స్టిట్యూట్‌లో మోహన్‌బాబు, రజనీకాంత్‌లిరువురూ స్నేహితులయ్యారు. అది అవసర స్నేహం కాదు. మనుషులు మనసులు కలిసిన స్నేహం. మోహన్‌బాబు ఆర్థిక అభివృద్ధిని కోరుతూ రజనీకాంత్ నటించిన అత్యంత విజయం సాధించిన తమిళ చిత్రం హక్కులను మోహన్‌బాబుకు యిప్పించడమే గాకుండా, ఓ గెస్టురోల్ (అతిథిపాత్ర)లో నటించాడు. ఆ చిత్రమే 'పెదరాయుడు'. ఆ చిత్రంతో మోహన్‌బాబు జీవితం మారిపోయింది. పట్టిందల్లా బంగారమైంది. మనసు విశాలత పెరిగింది. అక్కణ్ణుంచీ అతనికి విజయాలేగానీ, అపజయాలనేవి లేవు.

మనిషి ఎదిగిన కొద్దీ మనసు కూడా ఎదుగుతుందన్న సత్యం సత్యమైంది. నాలుగు దశాబ్దాలపాటు సినిమా రంగంలో ధీరోదాత్తుడైన హీరోగా ఉన్నాడంటే విజయం విలువ ఏంటో విదితమవుతూంది.

నాతో మోహన్‌బాబుగానీ, మోహన్‌బాబుతోగానీ నేను స్నేహం చేసినవారము కాము. 40 సినీ వసంతాల వేడుకలు జరుగుతున్నాయని వార్త ప్రకటించిననాడే– 'మోహన్‌బాబూ నాకు మోదకర విషయమయ్యా అని మనస్సులోనే 'శతః మానంభవతి! శతాయుష్యు ఆరోగ్య సౌభాగ్య సిద్ధిరస్తు– అని దీవించాను; దీవిస్తున్నాను దీవిస్తూనే ఉంటాను.

– గోటేటి

రంగారు బంగారు వణిక్ప్రముఖులు జి.ఆర్.టి.అధినేత జి.రాజేంద్రన్, వుమ్మిడి సుధాకర్ కుటుంబాలను కలిపిన రాజేష్, జయశ్రీల వివాహబంధం !

వుమ్మిడి రాజేష్, జయశ్రీ యువజంట మా ఇంటికి వచ్చినప్పుడు, నేనెంతగానో సంతోషించాను. పెద్దలపట్ల అణకువ, గౌరవం, మర్యాదల్ని గని, ఎంతో మహదానందం కలిగింది. ఇలాటి యువజంటలో ఇంతటి వొదిగే స్వభావం, సుహృదయ భావం ఉంటుందనే విషయం సందేహాత్మకంగా ఉండేది.

తల్లితండ్రుల జీవన ప్రభావమే వారి రక్తాణువుల్లో ఉంటుందనే విషయం వారిరువుర్నీ చూచినప్పుడు సత్యమనిపించింది. అందుకే మన సాంప్రదాయంలో వంశమును పరిశీలించి పెళ్ళిళ్ళు చేస్తూంటారు. వైశ్యుల్లో, బ్రాహ్మణుల్లో తదితర వర్గాల్లో యీ వివరాల్ను తరిచి తరిచి చూస్తుంటారు. వివాహమన్నది నూరేళ్ళ పంటయనే ధృఢ విశ్వాసం దక్షిణాది వారిలో యెక్కువగా ఈనాటికినీ పాటించబడుతూంది. వివాహ మంత్రాల్లో అటు మూడుతరాల్నీ, ఇటు మూడు తరాల పెద్దలను స్మరిస్తూ ప్రవర చెబుతూంటారు.

ప్రపంచం అంతా భారతీయ వివాహ సంప్రదాయాన్ని ప్రశంసిస్తూన్నారు. అలా చెప్పడంలో ఆనందం ఉన్నది. వంశ చరిత్ర చెప్పుకునే అవకాశం ఉన్నది.

ఇక్కడ వధూవర వంశాలు రెండూ ఆంధ్ర వైశ్య కుటుంబాలు. రెండు కుటుంబాలూ బంగారు నగల వ్యాపారంలో సిద్ధహస్తులు. చిత్తశుద్ధిగలవారు. ధర్మగుణం, ధార్మికసంపద కలవారు. ఎన్నో ఏళ్ళ తరబడి నగల వ్యాపారం చేస్తున్నవారు. వుమ్మిడి సుధాకర్, లలిత దంపతులు చిన్నజీయర్ స్వామి వారి అంకిత భక్తులు.

వుమ్మిడి రాజేష్ దాన్‌బాస్కో స్కూలులో చదువుకున్నాడు. చెన్నయ్ డి.జి. వైష్ణవ కాలేజీలో విద్యోపాసన చేసి పట్టభద్రుడయ్యాడు. 115 సం॥ములుగా చెన్నయ్‌లో బంగారు నగల వ్యాపారం చేస్తున్నన గోల్డు కింగ్‌లమని చెప్పాలి. ముంబాయ్ నగరంలో శిక్షణ పొందాడు. వినయంలో, వివేకంలో రాజేష్‌ను చెప్పుకోవాలి. మద్రాసులోని జ్యువెలరీ డైమండ్స్ అసోసియేషన్ కార్యవర్గ సభ్యుడు. పిన్న వయసులోనే బంగారు నగల రత్నాల అంతర్జాతీయ ఎగ్జిబిషన్ చైర్మన్‌గా అందరి ప్రశంసలు అందుకున్నవాడు.

రాజేష్ సతీమణి, జి.ఆర్.టి రాజేంద్రన్ కుమార్తెయైన జయశ్రీ విద్యారంగంలో అమేయమైన కృషిచేస్తున్న గృహిణీరమణి. అశోక్ నగర్‌లో గల జి.ఆర్.టి. విద్యాసంస్థను కేసరీ, విద్యా రామకృష్ణా విద్యాసంస్థలకు దీటుగా ఒంటిచేత్తో నిర్వహిస్తున్న ఘటికురాలు. వుమ్మిడి రాజేష్‌లా మృదుభాషిణి, మధురభాషిణి, మితభాషిణి. విద్యారంగ సేవలో సామాజిక సేవలో నిష్ణాతురాలు. ఆంధ్ర, ఆంగ్ల భాషలతో బాటు, సంస్కృత భాషాధ్యయనంలోనూ ప్రచారంలోని అవిశ్రాంత కృషి చేస్తున్న ఋషీమణి. శ్రీ పెరంబదూర్‌లో కల సంస్కృత కళాశాల పాలకమండలిలో సభ్యురాలిగా దేవభాష సంస్కృత ప్రచారాన్ని, సేవలకూ ఆమె ఎంతో కృషి చేస్తున్నది. జయశ్రీని గూర్చి చెప్పాలంటే ఎంతైనా ఉన్నది. భవిష్యత్ సంచికల్లో వివరించే ప్రయత్నం చేస్తాం. రాజేష్ జయశ్రీ దంపతులకు ఒక కుమారుడు, ఒక కుమార్తె. కుమారుని పేరు విష్ణు, కుమార్తె పేరు వర్ష. కుమారుడు విష్ణు కారు పందెముల్లోనూ ఎన్నో విజయాల్ను సాధించాడు. కుమార్తె వర్ష ఆర్కెటిక్‌గా నిపుణురాలు. రాజేష్, జయశ్రీల కుటుంబం తండ్రి, తాతల మంచితనాన్నే గాకుండా, వారి వారి సేవలకు వారసులుగా కొనసాగుతున్నారు. వీరిని గూర్చి కొంతయినా చెప్పడం నా ధర్మంగా భావించి క్లుప్తంగానే చెప్పాను. స్వస్తి, శుభమస్తు. ●

జి.ఆర్.టి. తండ్రీకొడుకులు రాజేంద్రన్, ఆనంద్, అనంత పద్మనాభన్

జి.ఆర్.టి. జ్యువెలర్స్ పుట్టిన 1964 సంవత్సరం నుంచీ నాకు తెలుసు. మొదటితరం ఖాతాదారుణ్ణి నేనేనేమో అని అన్నా అతిశయోక్తిలేదు. అంతక్రితం రాజేంద్రన్ బాంకులో పనిచేయడం నేనెరుగుదును. వాళ్ళ నాన్నమ్మగారను కుంటాను- మా సినిమాటోగ్రాఫర్ హనుమంతరావుగారుండే ప్రక్కవాటాలో ఉండేవారు. ఆమెను చూడడానికి ఆయన అక్కడకు తరచూ వస్తూండేవారు.

వారి కుమార్తె జయశ్రీని, వుమ్మిడి సుధాకర్ తనయుడు వుమ్మిడి రాజేష్‌కిచ్చి వివాహం జరిపిన సందర్భములో వివాహ విశిష్టతపై ఓ చిన్న పుస్తకం వ్రాసాను. అక్కణ్ణుంచి ఆయన షష్ట్యాబ్ది (ఏవీఎం రాజరాజేశ్వరీ హాలులో) జరిగిన సందర్భంలో ఆయన ప్రత్యేకంగా మనిషిని పంపిస్తూ ఆహ్వానపత్రం పంపారు. అప్పుడాయన నాణ్యత, నిపుణతగల జ్యువెలర్ మాత్రమే కాదు, మంచి దైవభక్తుడు. నుదుట విభూతి రేఖలు దిద్దుకుని, మధ్యమార్తాండుని వంటి వర్ణంలో నొసటబొట్టుపెట్టుకుని నిరతమూ క్యాష్ టేబుల్ వద్దనే కూర్చునేవారు. నిరంతరమూ ఆయన ముఖబింబంలో నవ్వు చిందులాడుతూనే ఉండేది. ఈయనకు చిరాకు కలుగదాయని చూచేవాణ్ణి. ఉస్మాన్‌రోడ్ ఒక్కచోటనే జి.ఆర్.టి. జ్యువెలర్స్ ఉండేది. అప్పటికింకా బ్రాంచీలుగానీ, విద్యాలయాలు గానీ, స్టార్‌హోటళ్ళుగాని ఉండేవి కావు.

ఆయన కుమారులు అనంతపద్మనాభన్‌గానీ, రాధాకృష్ణన్‌గానీ వ్యాపారంలో ప్రవేశించలేదు. వాళ్ళిద్దరూ చదువుతూనే ఉండేవారు. ఆయనలానే ఆ యిరువురు కుమారులూ మోముపై విభూతి రేక దిద్దుకుని కుందనపు కుంకుమబొట్టుపెట్టుకుని, నగుమోముతో వ్యాపారం చేసేట్టు చేసారు. జి.ఆర్.టి. శాఖోపశాఖలుగా విస్తరిల్లి హోటళ్లూ, రిసార్టులూ, విద్యాలయాలు పెరిగిన తరువాత, తండ్రీ కొడుకులు ముప్వురూ షోరూముల్లో కన్పడరు. వారి ఉద్యోగులను కూడా - వారి కుమారుల్లానే ట్రయనింగు యిచ్చారు. నెలసరి వాయిదా చిట్టులూ, గృహోపయోగకర గిఫ్టులు (వారే ప్రవేశపెట్టారు) ప్రవేశపెట్టిన తరువాత వారి వ్యాపారం ఆకాశంలా విస్తరించింది.

విద్యారంగంలో మాంటుసోరీ నుంచీ ఇంజనీరింగు కళాశాలల స్థాపన వరకూ పెరిగింది. ఆ విద్యాలయాల్లోని ఎడ్మిషన్ల కోసం 'క్యూల్లో' తల్లిదండ్రులు నిలబడే స్థాయికి వచ్చాయ్. బెంగళూరు, తిరుపతి, భాగ్యనగరాలందు కూడా జ్యువెలరీ వ్యాపారం విస్తరిల్లింది. జి.ఆర్.టి. అంటే నికార్సు బంగారు నగయనే సెంటిమెంటు పెరిగింది. ఏళ్ల తరబడీ ఉన్న నగల వ్యాపారులు వెనుక పడ్డారు. ఈనాడు విదేశాల్నుంచీ జి.ఆర్.టి. కొనుగోలు చేస్తున్నారు. కోట్ల కొద్దీ వ్యాపారం చేస్తున్నా- ఆ తండ్రీకొడుకులు ఎదిగినకొద్దీ వొదిగినట్టు మాట్లాడతారు. ఈ మధ్యకాలంలో ఇంతగా వృద్ధి పొందిన నగల సంస్థ జి.ఆర్.టి. అంటే ఆశ్చర్యపోనక్కర్లేదు.

ఇరువురి కుమారుల ఆనందాన్నీ రాజేంద్రన్ అనుభవిస్తున్నారు.

దసపల్లా గ్రూపు హోటళ్ల స్థాపకుడు
ఎం.రాఘవేంద్రరావు

ఎంత ఉన్నతికి ఎదిగారో అంత సామాన్యంగా కనిపించే వ్యక్తి, ఎంతగా వయసు పెరిగిందో అంతగా మనస్సు పెంచుకున్న వ్యక్తి రాఘవేంద్రరావు. మనస్సు వెన్నకన్నా మృదువైనది. సద్గురువులు కందుకూరి శివానందమూర్తిగారంటే ఆయనకంత భక్తి.

దసపల్లా హోటల్‌లో దిగితే రాజభవనంలో దిగినంత సంతృప్తి కలుగుతుంది. అంతటి రాచమర్యాద జరుగుతుంది.

కల్లాకపటం లేని మనిషి. హోటల్ వ్యాపారంలో ఉన్నప్పటికీనీ, హితులూ సన్నిహితుల పట్ల ఎంతటి వాత్సల్యం చూపుతారో అక్షరబద్ధం చేసి చూపడం కష్టం.

విశాఖపట్టణంలో ప్రపంచ తెలుగు సమాఖ్య మహాసభలు జరిగినపుడు విందు భోజనాలను ఆయన ఏర్పాటు చేసారు. ఎవరికీ ఏలోటు పాట్లూ జరుగకుండా ఆయనే స్వయంగా పర్యవేక్షించారు. అంత ఘనంగా ప్రపంచ తెలుగు సమాఖ్య వేడుకలు జరిగాయంటే ఆయన అవిశ్రాంత కృషి ఉన్నది.

వీరికి తోడు ఆనాటి శాసనసభా సభ్యులూ, ఈనాటి పార్లమెంటు సభ్యులు ఎంవిఎస్ మూర్తిగారు మరో కారణం.

విశాఖపట్టణం నడిమధ్యన వీరి స్టార్ హోటల్ ఉంది. ఈ హోటల్ని 2 స్టార్, 5 స్టార్ హోటలని విభజించి చెప్పను. ఎన్ని స్టార్‌లు చేర్చి చెప్పాలో అసలే చెప్పలేను.

దసపల్లా హోటల్‌లో చెప్పుకోదగిన మరో వ్యక్తి జనరల్ మేనేజర్ ఎస్. ప్రశాంత్. ఆయన ఆఫీసుగది. ఎంతో ప్రశాంతంగా ఉంటుంది. ప్రశాంత్ ప్రశాన్తచిత్తుడు. తల్లిదండ్రులు ముందే ఊహించి ఆ పేరు ఆ చిరంజీవికి పెట్టారనుకుంటాను.

హైదరాబాద్ జుబిలీహిల్సులోని ప్రశాంత ప్రదేశంలో దసపల్లా హోటల్ని నిర్మించారు. ఆ హోటల్‌లో కూడా రెండు రోజులు ప్రశాంతంగా గడిపాను అంటే దసపల్లా గ్రూపు హోటల్స్ జనరల్ మేనేజర్ ప్రశాంతే కారణం. రాఘవేంద్రరావు అతిథి ఆత్మీయధర్మంగా నిర్మించిన రిసార్టు హోటళ్ళ నిర్వహణంలో ప్రశాంత్‌ను గూర్చి ఎంతచెప్పుకున్నా తక్కువగానే కనిపిస్తుంది. సీతాఫలంలో ఎన్ని కళ్ళుండి మధురతను కురిపిస్తాయో అంతటి మధుర ఆతిథ్యాన్ని ప్రశాంత్ నిర్వహణమే కారణమని చెప్పకతప్పదు.

గుప్తా అవార్డులంటేనే నోబుల్ అవార్డులు
-తమ ఆదాయంలో ఓ బృహత్తర ప్రణాళికను అమలు చేస్తారు -

ఈ ఉత్సవాన్ని దర్శించి, ఆనందించే విధంగా చెన్నైయ్ నుంచీ పలువురు పెద్దలు, పదుగురు ఆహ్వానితులను సకల మర్యాదలతో ఏలూరు తీసుకుని వెడతారు. ఆడపెళ్ళివారు మగపెళ్ళివారికి చేసే మర్యాదలకన్నా మిన్నగా ఉంటాయ్.

ఎప్పుడు ఏలూరు వెడదామా- అనే ఎదురుచూచేవారు కూడా ఉంటారు. వీరి కొక ప్రత్యేక బోగీ ఏలూరులోని మొదటి ప్లాటుఫారం మీద దిగే సౌకర్యం ఉంటుంది. మోహన్‌గుప్త, కిషోర్‌గుప్త (తండ్రీకొడుకులు) లిరువురూ వారి వారి సిబ్బందితో వచ్చి- ఎవరిని ఏ హోటల్‌లో వసతి కల్పించాలో- (ముందే చార్టు తయారుచేసుకున్న ప్రకారం) ఆయా హోటళ్ళకు తీసుకుని వెడతారు. వారికి కారులను సిద్ధం చేసి ఉంచుతారు. ఇంతటి పకడ్బందీగా ఏర్పాట్లు చేయడం, పెద్దపెద్దల యింటి పెళ్ళి కార్యక్రమంలో కూడా జరుగదు. వసతి కల్పించిన గదిలోనే వారి పేరుగల ఫైలులో కార్యక్రమ వివరములు నిర్దేశించి ఉంటాయ్.

శ్రీ మోహన్‌గుప్త

శ్రీ కిశోర్‌గుప్త

నేను దేశ, విదేశాల్లో కూడా ఎన్నో కార్యక్రమాలకు వెళ్లాను. ఇలా క్రమ ప్రణాళిక ప్రకారం జరిగిన కార్యక్రమాన్ని చూడలేదు.

అవార్డు గ్రహీతలకు నూతన వస్త్రములతోబాటు రొఖ్ఖ బహుమానం ఎక్కువగా ఉండడం గుప్తా అవార్డులలోనే చూసాను. ఎలా భద్రంగా తీసుకుని వెళ్ళారో, అలాగే ఇంటికి చేర్చడంలోనూ శ్రద్ధ తీసుకుంటారు. అవార్డు అందుకున్నా, అందుకోకున్నా ఏలూరు వెళ్లడం ఓ చక్కని విహారయాత్ర.

అక్టోబర్ 31న ఏలూరులో గుప్తగారి జన్మదినోత్సవం అత్యంత వైభవంగా జరిగింది. పత్రికలన్నీ ఉగాదిపండుగ మహోత్సవంగా జరిగినట్లు వ్రాసాయి. కిషోర్‌గుప్తా చైనా వెళ్ళడం వల్లనో యేమో, ఈ సారి ఏలూరు వెళ్లినవారు తక్కువే.

వెళ్లినవారందర్నీ చెన్నయ్‌లోని కార్యాలయం మేనేజర్ సత్యనారాయణ త్రినాథ్ ప్రభృతులు చక్కని ఏర్పాట్లు చేసారు. షడ్రసోపేతమైన విందుతోబాటు- ఎక్కడా లభించని జున్ను, పూత రేకులూ - యిక్కడి ఆహుతుల జిహ్వాకు రుచించే రుచ్యములు కొల్లేటి సరస్సునూ, చిన్న తిరుపతిగా పేరుపొందిన ద్వారకా తిరుమలలోని శ్రీవేంకటేశ్వరుని దివ్యమూర్తి స్వరూపాన్ని దర్శించే అవకాశం, వరాల తల్లి విజయవాడ కనకదుర్గమ్మనూ దర్శించి, కృష్ణానది అందచందాలను చూచే మహదవకాశము గుప్తా బ్రాండు గ్రాండు పర్యటనలోనే చూడగలం. మగపెళ్లివారిలా మర్యాదలందుకుని చెన్నపట్నం తిరిగి రావడమొక అంబరమును చుంబించినట్టి సందర్భం.

మోహన్‌గుప్త, కిషోర్‌గుప్త లిరువుర్నీ ఆయురారోగ్య ఐశ్వర్యాలతో తులతూగాలని ప్రముఖాంధ్ర ఆకాంక్షిస్తూ అభినందిస్తున్నది.

రాతి స్తంభాలలో రాజులు రాగాలను పలికిస్తే తెలుగునాట నాటకకళను జ్వలింపచేశారు జమీందారులు!

పద్యనాటకాలకూ, పౌరాణిక నాటకాలకూ పెట్టింది పేరు తెలుగు గడ్డ. ఈ గడ్డలో మీగడతో నిండిన 'గడ్డపెరుగు' వంటి రుచి కల్గిన నాటకాలను ప్రదర్శింపచేసిన వారు తెలుగు జమీందారులు. ఇలా తెలుగు ఇలాతలంపై తెలుగు పురాణేతిహాస సాంప్రదాయ పద్యనాటకాలను ప్రదర్శింపచేసిన కీర్తి, ఖ్యాతీ మైలవరం జమీందారులకు చెందుతుంది.

ఎన్నెన్ని నాటకాలు, ఎందరెందరు నటులు మైలవరం జమీందారుల గొడుగు నీడన నాటక కళను రసింప చేశారు. మాధవపెద్ది వెంకట్రామయ్య, వేమూరి గగ్గయ్య వంటి ఉద్దండ నట గండర గండలు నాటక ప్రచండ విక్రమార్కులై తెలుగు సినిమాలందు సహితమూ ప్రవేశించి ప్రభవింపచేశారనేదీ ప్రస్తావన కందని విషయం.

దశాబ్దాల తరబడి తెలుగు పద్య నాటకాలు ప్రభవించి, శతాబ్దాల వరకు సౌగంధ పరిమళం గుభాళిస్తూన్న కారణ విశ్లేష కారకులు మైలవరం జమీందార్లూ, నాందీ ప్రస్తానం సలిపిన కీ॥శే॥ రాజా సూరానేని వేంకట పాపయ్యారావు బహద్దూర్ జమీందార్‌గారు. వారికి తెలుగు పద్యనాటకాల పట్ల అపారమైన అనురాగం ఉండేది. ఆయనే స్వయంగా బాలభారతీ నాట్యమండలిని స్థాపించారు. ఎందరో నాటకకర్తల్ని, కళాకారుల్ని ప్రోత్సహించారు. శ్రావ్యంగా పద్యం పాడే వారంటే ఆయనకు అంకితమైన అనురాగం, ఆప్యాయంగా ఆదరించే వారు.

ఇంతకూ ఈ మైలవరం ఎక్కడుం దయ్యా అంటే ఆంధ్రప్రదేశ్ నడిబొడ్డునున్న కృష్ణాజిల్లాలో ఉంది. కృష్ణవేణీల అంతర్వాహినీ ప్రభావమో ఏమో, ఇటు కూచిపూడినీ, అటు మైలవరమునూ నటరాజు నగుమోము కాంతులూ, సిగలోని శశాంకుని చంద్రికలూ కాలి గజ్జలై ఒకచోట, రవ్వలై ఒకచోట ప్రభవించాయ్, ప్రతిభాకాంతులైన కళాకారులు ఉద్భవింపచేశాయ్. జమీందారుగారు కృష్ణానది ఒడ్డున బొడ్డులా ఉన్న విజయవాడలో 'మైలవరం హాలు'ను నాటక ప్రదర్శనకు అనువైన హాలుగా నిర్మించారు. ప్రదర్శనకనువైన వసతులు కల్పించారు, తెరలు, దృశ్య తెరలు, ప్రక్కతెరల ఏర్పాట్లు చేశారు. ప్రేక్షకులు కూర్చుని నాటకం తిలకించడానికి ఏర్పాట్లు చేశారు. నెల వేతనంపై ప్రదర్శనకింతనే పారితోషికంపై కళాకారుల్ని నియమించి పోషించారు. కళనూ, కళాకారులనూ పోషించాలనెడి ఏకైక లక్ష్యం కారణంగా ఆయన ఆస్తులు కృష్ణ పక్షపు చంద్రునిలా క్షీణించ నారంభించాయ్. అయినా ఆయన తుదిశ్వాసవరకూ నాటక కళా పోషణనూ, ప్రదర్శనలనూ విరమించలేదు. ఆయన గతించిన కారణంగా నాటకాలూ తగ్గాయ్, నాటకపోషణా తగ్గింది. మరల కొంతకాలానికి నేనున్నా నంటూ నిబ్బరంగా, నిండు ధైర్యమిస్తూ ఆయన వంశజ్ఞుడు రాజా శ్రీ ఎస్.వి. ఆర్.జి. నరసింహారావు బహద్దూర్ వారు రంగప్రవేశం చేశారు. బాల భారతీ నాట్యమండలిని పునరుద్ధరించారు. నాటకనటులకు ప్రోత్సాహమివ్వడం ప్రారంభించారు. మళ్లీ పద్యనాటకాలు పునః ప్రారంభమయ్యాయి. పద్యనాటక పోటీలు బయల్దేరాయ్. పద్య నాటకాలే కాకుండా, పద్య నృత్యనాటకాలు, బాలేలు ప్రదర్శితం కాసాగాయ్.

రాజా ఎస్వీ ఆర్జీ నరసింహారావు

ప్రఖ్యాత కూచిపూడి కళాకారుడు వేదాంత సత్యనారాయణ శర్మ వంటి నృత్యకళాకారులు 'ఉషా పరిణయం' వంటి కూచిపూడి సాంప్రదాయ నృత్య నాటకాల్ని సహితమూ ప్రదర్శించ నారంభించారు.

1976 సం॥ములో శ్రీ నరసింహారావు బహద్దూర్ వారి షష్ట్యాబ్దుత్సవాన్ని కళాకారులూ, ప్రజలే పూనుకుని, 'నభూతో న భవిష్యతి' అన్నరీతిగా పెద్ద పర్వపు దినంలా జరిపారు. పూలతో రధాన్ని అలంకరించి, రాజావారిని అందులో ఉపవిష్టుల్ని కావించి, అరవై జతలఎడ్లను కట్టి ఊరేగించారు.

రాజా సూరానేని వేంకట పాపారావు

రైతులందరూ కూడా ఆ రధాన్ని లాగారు. నిజానికా రధంలో సప్తాశ్వరూఢుడైన సూర్యభగవానుడు వస్తూన్నంతగా, తిరుమలలో జరిగే రథసప్తమీ ఉత్సవంలా, బ్రహ్మాండంగా ఊరు నలువీధుల్లోనూ ఊరేగించారుట.

ఇలాటి కళామూర్తులూ, కళారాధకులైన జమీందారు లున్నారా, ఉంటే పద్యనాటక స్థితి ఇలా ఇంత దిగజారుడుగా ఉంటుందా? మళ్లీ అలాంటి రోజులు వస్తాయా - మనం చూడగలమా? అందుకే చూచిన వారు చూచినట్టుగా చెప్పినదే ఈ వ్యాసంలో పొందుపరిచాం. ●

We Provide your comfortable Stay and Tasty Food Hospitality

b-d

Bhimas Deluxe Hotel

(PROPRIETORS BHIMAS HOTELS LIMITED)

34-38, G.Car Street (Near Railway Station),
TIRUPATI - 517 501 (A.P.)
Phone : 0877-2225521, 6669199, Fax : 2225471
Website : www.bhimasdeluxehotels.com
E-mail : bhimasdeluxe@rediffmail.com

స్వర రాగేశ్వరరావు సాలూరి రాజేశ్వరరావు

మురళీకృష్ణనిలా చిత్రరంగప్రవేశం చేసి, నటవటుడల్లా, నవరాగమోహన గాయకుడై లలిత సంగీత గీతాలతో మోహపరిచి, సమ్మోహపరిచి, మోహన మృదు మంజుల మధుర సుధారస గానస్వరబద్ధుడైన స్వరకూర్పరి. తమిళ, తెలుగు, హిందీ చిత్రరంగ ప్రేక్షకులనుర్రూత లూగింపచేసిన స్వర రాగ సమ్మోహన సంగీత దర్శకుడు అంటే ఆశ్చర్యపోవలసిన అవసరం లేదు, అతిశయోక్తి కానే కాదు.

పాట పాడుతూ కృష్ణ, ఆ తోటలోనొకటి, బంగారు పాపాయి, చల్లగాలిలో యమునాతటిపై – అన్న గ్రామఫోను పాటల్ను స్వరకల్పన చేసినవీ, స్వయంగా పాడినవీ, రావు బాలసరస్వతీ దేవితో కలిసి యుగళ గీతాలుగా పాడినవి జగజగాల యుగయుగాల వరకూ స్మరణలోనే ఉంటాయ్. సునామీలుగానీ, భూకంపాలు గానీ, ఆ పాటల్ను హరించలేవు. దివిగానీ, భువిగానీ ఆ పాటల మాధుర్యాన్ని మరిచిపోలేవు. అంతటి సుమసున్నిత సుస్వర రాగగీతి కలవి. గూడవల్లి రామబ్రహ్మంగారి 'ఇల్లాలు' చిత్రంలో రాజేశ్వరరావు గారితో నటించి పాటలు పాడినట్లు ఆమె చెప్పినట్లు కూడా విన్నాను.

సుప్రసిద్ధ సంగీత దర్శకుడు నౌషద్ ఆలీ చెంత రాజేశ్వరరావు గారు గజల్సు పాడి, ఆయన మెప్పులందడమే గాకుండా ఓ హార్మోనియమును బహుమతిగా పొందారు. జెమినీ వారు నిర్మించిన 'చంద్రలేఖ' చిత్రం యావద్భారత దేశంలో వారికెనలేని పేరు ప్రఖ్యాతుల్ని కూర్చింది. అప్పట్నుంచీ ఆయన తిరుగులేని సంగీత దర్శకుడయ్యారు. ఈ బహుముఖ ప్రజ్ఞాశాలి సంగీత స్వరకల్పనకే తాను అంకితమయ్యారు.

1934 సం॥లోనే ఆయన 'భగవద్గీత' రికార్డునివ్వడం, అనన్తరం జయప్రద ఇల్లాలు చిత్రాలకు సంగీతం కూర్చిన 'పాటలు' సుశ్రావ్యంగా ఉన్నప్పటికీనీ, చిత్రం విజయవంతం కాలేదు. మరో విచిత్రమేమంటే జెమినీ వారి 'బాలనాగమ్మ'కు సంగీతం కూరుస్తూనే, మరో పోటీ 'బాలనాగమ్మ'కు సంగీత స్వరకల్పన చేస్తూ, ఓ ముఖ్య పాత్రను కూడా ధరించారు. జెమినీ సంస్థలోని పలు చిత్రాలకు సంగీతం సమకూర్చారు. వారికి 'చంద్రలేఖ' యావద్భారత కీర్తి సంపాదించి పెట్టినప్పటికీనీ, వాహినీ వారి 'మల్లీశ్వరి' స్వరకల్పన' పాటలే, అత్యంత కీర్తి ప్రతిష్టలు సముపార్జించి పెట్టాయంటారు. ఈనాటికినీ ఏనాటికినీ, భూత వర్తమాన భవిష్యత్కాలాల్లో ఎప్పటికినీ మరుపురాని మధుర మధురాతి గీతికలవి.

'మల్లీశ్వరి' తరువాత 'విప్రనారాయణ', 'అమరశిల్పి జక్కన' 'భక్తజయదేవ', 'ఇద్దరు మిత్రులు', 'డాక్టర్ చక్రవర్తి', 'బొబ్బిలి యుద్ధం', ఇలా చెప్పుకుని పోతూంటే రెండూ, రెండు వందల యాభై చిత్రాలకు పైగా ఉన్నాయ్. ఏ చిత్రానికి ఆ చిత్రమే ప్రత్యేక స్వర సంపుటి గలవి. ఆయనకు 'భీంపలాస్' రాగమన్నా, కళ్యాణి, మోహనరాగాలన్నా అత్యంత ప్రీతికరమనీ, ఆ రాగాల్లోనే ఆయన అధిక గీతాలకు స్వరకల్పన చేశారనీ ఆయన అభిమానులంటారు. కానీ ఆ బుర్రలో మెదలని రాగమంటూ లేదని, రాగాల మేళవింపులో ఆయన్ను మించిన ఘనులు అరుదనీ నేనంటాను. రాగ కల్పనలోనూ, భావానికనువైన స్వరం కూర్చడంలోనూ, వాటికనువైన సాహిత్యాన్ని కవి కల్పించడంలోనూ తనకు నచ్చితేనే రాజేశ్వరరావు 'ఓకే' (సరే) అనేవారే తప్ప, ఎవరూ చెప్పినా (నిర్మాత చెప్పిననూ) రాజీపడని సంగీత దర్శకుడు శ్రీ రాజేశ్వరరావు ఒక్కరేనని, ఓసారి జ్ఞానపీఠ అవార్డు గ్రహీత, సుందర పదగుంభిత పదకదనాకర్త యైన సి. నారాయణరెడ్డిగారు కూడా చెప్పారు. పైగా సినిమా రంగంలో తాను 'గురూ!' అని సంబోధించిన వ్యక్తి ఒక్క సాలూరి రాజేశ్వరరావుగారినేయని నొక్కి చెప్పారు.

రాజేశ్వరరావు స్వరకల్పనలో ఎక్కువగా సినిమా పాటలకు సాహిత్యమందించిన వారు ఆరుద్ర, సి. నారాయణరెడ్డిలే! సాహిత్యానికి స్వరం కూర్చడంలో కూడా రాజేశ్వరరావు సంగీత ఘనాపాటీ! సన్నివేశ సందర్భానికి అనుగుణంగా స్వర కూర్పును కూర్చడంలో ఆయనే మేటి! ఎంతటి గాయనీ గాయకులైనా సరే

స్వరలయలు సుతిబద్ధంగా, నిబద్ధతతో పదోచ్చారణ చేయకపోతే, ఆమోదించేవారు కాదనీ, రాజీపడని రాజేశ్వరరావుయనీ అంటారు.

ఆంధ్ర విశ్వవిద్యాలయం 'డాక్టరేట్'తో, తమిళనాడు ప్రభుత్వం 'కలైమామణి', ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 'రఘుపతి వెంకయ్య' ప్రతిష్ఠాత్మక అవార్డులతో సత్కరించింది. పిన్నవయసు లోనే చలనచిత్రరంగంలో ఆరు దశాబ్దాల పాటు తన సంగీత ప్రభావాన్ని విరజిమ్మి పోసిన రసాలూరించే సాలూరి రా(గే)జేశ్వర రావు, ఆలాపనలోనూ, సంగీత కల్పనలోనూ రాజేశ్వరరావుకు రాజేశ్వరరావే సాటి, సంగీత రసాలమేటి! తన తండ్రి వద్దనూ, ద్వారం వేంకటస్వామి నాయుడుగారి వద్దనూ, ఆదిభట్ల నారాయణదాసుగారి వద్ద, సంగీతాభ్యాసనం చేసిన రాజేశ్వరరావు గురువుల్ని మించిన శిష్యుడవడమేగాకుండా, సత్సంగీత సంతాన మును పరిశ్రమకందచేశారు. అలాటి మేటి కోటి, వాసూరావు వంటి మెరికల్లాటి సంగీత పుత్రరత్నాల్ని చలనచిత్ర రంగాని కందించారు. సాలూరి వాసూరావు చలనచిత్రాలతో బాటు బుల్లిచిత్ర రంగంలో కూడా బుల్లెట్‌లా దూసుకుని పోతున్నాడు. వివేచనశక్తితో బాటు వినయ సంపద కూడా వాసూరావులో మిక్కుటంగా ఉంది. భగవాన్ సత్యసాయీ వారు బంగారు గొలుసునిచ్చి ఆశీర్వదింపబడిన ఘనుడీ వాసూరావు. ●

జీ.వి. రావ్ పేజీ

జీవచ్ఛవములా పడి ఉండకండి. శ్రమించడం మొదలుపెడితే అనంత శక్తి మీలో జాగృతమవుతుంది.

- స్వామి వివేకానంద

(గోటేటి వేంకటేశ్వరరావు)

బాలమురళి పలుకు ఇక బంగారం, మనం జాగ్రత్తగా కాపాడుకోవాలి



తన పాటతో మనల్ని పులకింపజేసిన సరస్వతీ పుత్రుడు. ఆయన సాహిత్యానికి విలువనిస్తు కీర్తనను పాడితే ఆ పాట విలక్షణంగా కనిపించేది. ఎందరో పాడుతున్నారు. కానీ ఆయన పాట తీరు వినూత్నంగా వుండేది. ఆయన సంగీత గని, స్వరరాగఝురి, సాక్షాత్తు సరస్వతీ అంశ రాగరాజు త్యాగరాజు తరువాత అంతటివాడంటే అతిశయోక్తి కాదేమో. ఎన్నో కొత్త క్రొంగొత్త రాగాలను కనిపెట్టిన సంగీతస్రష్ట, సంగీతం ద్వారా రోగాలను నయం చెయ్యవచ్చని, మ్యూజిక్ థెరపీ మీద ఎన్నో ప్రయోగాలు చేసారు.

త్యాగరాజస్వామికి ప్రత్యక్ష శిష్యపరంపరలో నేను 5వ తరం వాణ్ణి అని ఆయన చెపుతూండేవారు. త్యాగయ్యకు మానాంబు చావిడి, ఆయనకు ఆకుమళ్ళ వెంకటసుబ్బయ్య, ఆయనకు సుసర్ల దక్షిణామూర్తి, ఆయనకు పారుపల్లి రామకృష్ణయ్య ఆయనకు నేను అంటూ 5 తరాలు చెప్పేవారు.

ఆయన పాడిన సినిమా పాటల్లో మౌనమే నీ భాష ఓ మూగమనసా (గుప్పెడు మనసు) పలుకే బంగారమాయనే (అందాలరాముడు) పాటలు నాకెంతో ఇష్టం.

జ్యాతస్యహి ధ్రువో మృత్యుః – అన్నారు. పుట్టినవారు మరణించక తప్పదు. కాని కొందరి మరణం మనల్ని బాధిస్తుంది. ఇంకొంత కాలం వుంటే బాగుండేది అనిపిస్తుంది. ఆ కోవకు చెందినవారు బాలమురళీకృష్ణ. అంతటి గొప్ప శాస్త్రీయ సంగీత విద్వణ్మణి మన తెలుగువారు కావడం మన అదృష్టం. ఆయన భారతదేశం గర్వించదగ్గ కళాకారుడు కావడం తెలుగువారి ఆనందం. ఆయన స్థానాన్ని భర్తీ చేయడం చాలా కష్టం.

భక్తప్రహ్లాదలో నారదుడి పాత్ర ద్వారా ఆయన సినిమా నటుడిగాను ప్రత్యేకతను చాటుకున్నారు. ఆ పాత్రలో హాస్యం కలగలిసిన హుందాతనాన్ని ప్రదర్శించారు. అంతేకాదు ఇంకో విశేషమేమంటే శ్రీ బాలమురళికృష్ణ గారు కర్ణాటక సంగీతంలోనే దిట్ట కాకుండా సినిమా సంగీతంలోను గాయకుడిగా హంసగీతే కన్నడ చిత్రంలోను, సంగీత దర్శకుడిగా "మద్వాచార్య" చిత్రానికి నేషనల్ అవార్డులు స్వంతం చేసుకున్నారు. ప్రపంచం అంతా ఖ్యాతిగాంచిన శంకరాభరణం చిత్రంలో అన్ని పాటలు ఆయనే పాడవలసినది, ఆయన ఆ సమయంలో రెండు నెలలు విదేశీ పర్యటనలో వున్నందువల్ల వీలుగాకుండా పోయింది. తెలుగులో ఆయన ఒకే ఒక్క సినిమాకు సంగీత దర్శకత్వం వహించారు. అది 1997లో "తోడు" అనే చిత్రం.

ఆయన పెద్దగా చదువుకోకపోయినా 12 విశ్వవిద్యాలయాల నుండి "డాక్టరేట్" పొందిన మేధావి.

ఇలాంటి సంగీతకారుడు మరిరాడు, ఇలాంటి మహా వాగ్గేయకారుడు ఇక జన్మించదు. అందుకని ఆయన పలుకులను బంగారంలా పదిలంగా దాచుకుందాం. ముందు తరాలకు అందజేద్దాం. అదే మన ఘన నివాళి.

ప్రముఖాంధ్ర వర్థిల్లాలి

ప్రముఖాంధ్ర ఈ నెలతో 22 ఏళ్ళు పూర్తి చేసుకుని, జనవరి 2017లో 23వ సంవత్సరంలోకి అడుగుపెడుతోంది. గత 22 ఏళ్ళుగా ఈ సంచికలను తీసుకురావడానికి నాన్నగారెంతో శ్రమపడ్డారు, ఆయాసపడ్డారు కూడా. ఈ 22 సంవత్సరాలు ఆయన శ్వాస, ధ్యాస ప్రముఖాంధ్రే. తెలుగు భాష గొప్పదనాన్ని, తెలుగువారి గొప్పదనాన్ని నలుగురికి తెలియపరచాలనేదే ఆయన తపన, తపస్సు. ఇందులో ఆయనకు సహకరించింది, ఆయన స్నేహితులే (అందులో ఆర్యవైశ్యులు ఎక్కువ). వారే ఈ ప్రముఖాంధ్రకు ఆయువుపట్టు. గత రెండేళ్ళుగా ఆయన ఆరోగ్యం పూర్తిగా క్షీణించింది. ఆర్థిక స్థోమత లేని పత్రిక ప్రముఖాంధ్ర. పత్రికకు ప్రకటనలు కాని, చందాలు కాని, విరాళాలు కాని, ఒకటి తెలుగు భాషపై మక్కువతో ఇవ్వాలి, లేదా ఆయన చిత్తశుద్ధిని చూసి ఇవ్వాలి. నేను ఆయన స్నేహితులకు ఎక్కువగా తెలియదు. నేను బిడియస్తుడిని. నలుగురిలోకి వెళ్ళి పరిచయాలు పెంచుకుని అడగలేకపోయాను. రెండుమూడుసార్లు వెళ్ళి అక్కడ నుండి వుత్తి చేతులతో తిరిగొచ్చాను. పోనీలే మన ప్రెస్సులోనే అచ్చువుతుంది కదా అనుకొన్నాను. కానీ గత సంవత్సరం వర్షంలో ప్రెస్ మొత్తం దెబ్బతిని పరిస్థితి తారుమారయ్యింది. ఏది మనకు పునాది అనుకున్నానో ఆ పునాదులే కదిలిపోయాయి. అయినా మొక్కవోని ధైర్యంతో, అంత ఇబ్బందులలోను ప్రముఖాంధ్ర మానలేదు. ఒక్క నెల ఆగలేదు. గత అయిదారు నెలలుగా నాన్నగారు మంచంపైనుండి కిందకు దిగే పరిస్థితి లేదు. ఆరోగ్యం మరీ క్షీణించింది. దానిని తగ్గట్టు కాలు ఫ్రాక్చర్. ఇబ్బందుల మీద ఇబ్బందులు.

మీ అందరికి ఇది చాదస్తంగా అనిపించవచ్చు, అన్ని ఇబ్బందులలో ఎందుకు పత్రిక తీసుకురావడం అనిపించవచ్చు. ఎవరిని ఉద్ధరించడానికని ప్రశ్నించవచ్చు. ఇలా చాలా ప్రశ్నలు వెయ్యచ్చు. నేను ఇలా చాలాసార్లు అడిగాను, ఇదే జవాబు:

నేను చెన్నై కట్టుబట్టల్తో వచ్చాను, పెద్దగా చదువులేదు. రెక్కాడితే కాని డొక్కాడదు. నాకు తెలిసిందల్లా తెలుగు భాష మాత్రమే. ఆ భాషా జ్ఞానంతోనే పత్రికలలో పనిచేసా, పత్రికలు నడిపా, సినిమాలు తీసా, కాని ఏది కంటిన్యూగా చెయ్యలేకపోయాను. ఈ ప్రముఖాంధ్ర పత్రికను నేను 22 సంవత్సరాలూ ఉచిత పత్రికగా తీసుకువస్తున్నందుకు కారణం ఆ తెలుగు తల్లే. పత్రికలో తెలుగు తప్ప మరో అంశం వుండదు. తెలుగు భాష, తెలుగు సాంప్రదాయం, తెలుగుతనం, తెలుగువారు ఇవి తప్ప ఇంకేముంది. అందుకే ఆ పత్రిక ఆగకూడదన్నది ఆయన కోరిక.

మంచంమీద పడుకునే ఎంతోమందికి ఫోనులు చేస్తూ సమాచారం గ్రహించి, ఆయన పత్రిక నడుపుతూన్నారు, ఆయన ఎక్కువగా కనిపించనందువల్ల కొందరు ప్రకటనలు ఇవ్వడం మానుకున్నారు. ఇన్ని ఇబ్బందులలోను ఆ పత్రిక వస్తోందంటే కారణం దైవానుగ్రహమే. అదే శ్రీరామరక్ష. (చాలా విషయాలు రాసి ఎవరిని బాధించకూడదని కొట్టేసాను). ●